
మహానాడులో పలువురికి బాధ్యతలు

ఖమ్మం మామిళ్లగూడెం, మే 20 (ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహించనున్న టీడీపీ మహానాడులో ఖమ్మం జిల్లా నేతలకు బాధ్యతలు అప్పగించారు. 27,28, 29న జరిగే మహానాడు కోసం కమిటీలు వేశారు. వీటిలో ఖమ్మం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పలువురు నాయకులకు బాధ్యతలను అప్పగించారు. కేతినేని హరీష్‌చంద్రను అలంకరణ కమిటీకి, కనకాల సాంబశివరావును వసతి ఏర్పాటు కమిటీకి, కూరపాటి వెంకటేశ్వర్లును భోజనాల ఏర్పాటు కమిటీకి, వాసిరెడ్డి రామనాథంను రక్తదానం, మెడికల్ క్యాంపు కమిటీకి, కాపా కృష్ణ మోహన్‌ను రవాణా కమిటీకి ఎంపిక చేశారు. వీరంతా కడపకు వెళ్లి బాధ్యతలు నిర్వహించనున్నారు.

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

ఖమ్మం

KHAMMAM

బుధవారం, 21 మే 2025

ఈ సారి వానాకాలం సీజన్‌లో జిల్లాలోని ఎన్నెస్పీ ఆయకట్టులోని కొన్ని ప్రాంతాల్లో ఖరీఫ్ సాగు ముందుగానే ప్రారంభమయ్యే అవకాశం ఉంది. గతంలో వరుణుడు కరుణించి నాగార్జునసాగర్ నిండిన తరువాతనే ఎన్నెస్పీ ఆయకట్టుకు నీరు వచ్చేది. అయితే ఈ సారి గోదావరి జలాలు కృష్ణమ్మ కంటే ముందుగానే ఎన్నెస్పీ ఆయకట్టును తాకనున్నాయి. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు లింక్ చేయడంతో ఈ సారి గోదావరికి ఎప్పుడు వరదలు ప్రారంభమైతే అప్పుడే సీతారామ పంప్‌హౌజ్‌ల నుంచి నీటిని లిఫ్ట్ చేసి వైరా రిజర్వాయర్‌కు తరలించనున్నారు. అక్కడి నుంచి సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో సాగర్ ఆయకట్టుకు ముందే సాగు జలాలు అందనున్నాయి.



సాగు.. ఇక బహు బాగు!

సీతారామ జలాలతో ఎన్నెస్పీ ఆయకట్టులో ముందుగానే మొదలుకానున్న వానాకాలం సీజన్

- ఏన్కూర్ లింక్ కెనాల్‌తో వైరా రిజర్వాయర్ అనుసంధాన ఫలితం
- గోదావరికి వరద రాగానే విడుదలకు సన్నాహాలు
- ఎన్నెస్పీ జలాల కోసం నిరీక్షణ తప్పినట్టే..
- కాల్వలను సిద్ధం చేస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు


ఖమ్మం, మే 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు కింద ఉన్న బీజీ కొత్తూరు, పూసుగూడెం, కమలాపురం మూడు ఎత్తిపోతల నుంచి సుమారు వంద కి.మీ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు రానున్నాయి. దీంతో ఈ కావుల వెళుతున్న ప్రాంతాల్లో రైతులు మోటార్లు, ఇంజన్ల ద్వారా నీటిని లిఫ్ట్ చేసి సాగుకు వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. జూలూరుపాడు మండలం వినోబానగర్ నుంచి సీతారామ ప్రధాన కాలువ ద్వారా గతేడాది రూ.90కోట్లతో నిర్మించిన రాజీవ్ కెనాల్ ఏన్కూరు వద్ద సాగర్ ఎడమకాలవకు అనుసంధానమైన విషయం విధితమే. గతేడాది ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీతారామ ప్రాజెక్టును ప్రాథమికంగా ప్రారంభించారు. ఆ తర్వాత జూలూరుపాడు నుంచి ఏన్కూరు వరకు నిర్మించిన రాజీవ్ లింక్‌కెనాల్‌కు ఈ సీజన్‌లోనే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీరు విడుదల చేశారు. ఇది కూడా ట్రయల్‌రన్ అనే చెప్పాలి.

ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, సత్తుపల్లి మండలాల్లో పర్యటించి సత్తుపల్లి టన్నెల్ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. జూన్, జూలైలో ఎప్పుడు గోదావరికి వరద వచ్చినా.. వెంటనే సీతారామ లిఫ్ట్‌ల నుంచి నీరు పంపింగ్ చేయాలని సూచించారు. దీంతో నీటిపారుదలశాఖ అధికారులు ఈ దిశగా కాలువలను శుభ్రం చేయడం, గ్యాప్‌లను పూర్తిచేయడంతో పాటు మూడు ఎత్తిపోతల పథకాలను రన్నింగ్‌లో ఉంచే పనులు పూర్తిచేస్తున్నారు. 'సీతారామ'తో నీరు విడుదల చేయడం ద్వారా వైరా రిజర్వాయర్‌ను నింపి సాగర్ కాలువల ద్వారా లంకాసాగర్, బేతుపల్లి ప్రాజెక్టులను కూడా నింపనున్నారు. సాగర్ ఎడమకాలువ నుంచి సుమారు లక్షా 50వేల ఎకరాలకు నీరందిస్తారు. తద్వారా వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో ముందుగానే ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది.

ఖరీఫ్ ఆలస్యానికి చెక్..

ప్రతిఏటా ఆకాశవాయు కింద బోర్లు, మోటర్లు ఉన్న రైతులు నారు (మిగతా 6వ పేజీలో)

మంత్రి తుమ్మల కృషి..



2016 రూ.13,057కోట్ల అంచనాలతో సీతారామ ప్రాజెక్టు పనులు ప్రారంభించగా ఇప్పటికే రూ.10వేల కోట్లకు పైగా ఖర్చు చేశారు. గత బీఆర్ఎస్ పాలనలో ఐదేళ్లపాటు పనులు నిలిచిపోవడంతో ఈ ప్రాజెక్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి తుమ్మల చొరవ తీసుకుని ఇప్పటికే రూ.10వేల కోట్లు ఖర్చుపెట్టిన ఈ ప్రాజెక్టును సత్వరం వినియోగించుకునేందుకు మోటార్లను రన్నింగ్‌లో పెట్టాలని ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా సాగర్ కృష్ణా ఆయకట్టును గోదావరి జలాలతో అనుసంధానం చేయాలని ప్రతిపాదించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సీతారామ ప్రాజెక్టు ప్రధానకాలువ ప్రారంభం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి నుంచి పరిశీలించారు. అనంతరం లింక్‌కెనాల్ మంజూరు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మోటార్లను ప్రారంభించి గోదావరి జలాలను కాలువకు వదలడం ద్వారా నిరుపయోగంగా ఉన్న సీతారామ ప్రాజెక్టు పనిచేయడం ప్రారంభించింది. అయితే గతేడాది కేవలం నామమాత్రంగానే ఈ ప్రాజెక్టును వినియోగించగా ఈ సీజన్ నుంచి పూర్తిస్థాయిలో సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలను మళ్లించబోతున్నారు.

అక్రమార్కులపై కొరడా

- కేఎంసీలో రెవెన్యూ సెక్షన్ ప్రక్షాళనకు కమిషనర్ అభిషేక్ శ్రీకారం
- ఆర్‌వో రిలీవ్.. ఇద్దరు ఆర్ఐలకు షోకాజ్‌లు
- ఇద్దరు ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ల తొలగింపు
- దొంగ అసెస్‌మెంట్ల వ్యవహారంలో పండుతున్న పాపాలు



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖమ్మం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో రెవెన్యూ విభాగం ప్రక్షాళన మొదలైంది. ఈ విభాగంలో దొంగ అసెస్‌మెంట్లు వేసి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిన అంశాలు వెలుగులోకి వచ్చినప్పటికీ నాటి అధికారులు కేవలం సెక్షన్లు మార్చి చేతులు దులుపుకొన్నారు. దాంతో కొత్తగా విధుల్లో చేరిన వారు సైతం పాత పద్ధతిలోనే దొంగ అసెస్‌మెంట్లు వేస్తూ అక్రమాలకు పాల్పడుతూ వస్తున్నారు. ఈ క్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో అసిస్టెంట్ కమిషనర్ విచారణ నిర్వహించి ప్రక్షాళనకు పూనుకున్నారు. అందులో భాగంగా ఐదు రోజుల క్రితం ఆర్వో జి.శ్రీనివాసరావును మహబూబాబాద్ మునిసిపాలిటీకి డిప్యుటేషన్‌పై బదిలీ చేసిన అధికారులు.. మంగళవారం ఆయనను రిలీవ్ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ మేనేజర్ బుచ్చిబాబుకు బాధ్యతలు అప్పగించారు.

అలాగే ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన కంప్యూటర్ ఆపరేటర్లు కూడా అక్రమాలకు పాల్పడినట్టు తేలడంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సునీత, సందీప్‌లను సర్వీస్ నుంచి తొలగిస్తూ సంబంధిత మదర్ థెరిస్సా గ్రూపునకు అప్పగించారు. వారి ఐడీ నెంబర్లను సైతం బయోమెట్రిక్ నుంచి తొలగించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఆర్ఐ ఏ.జ్యోతి, వజ్రపు రామారావులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే దీనిపై మరింత లోతైన విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సైతం అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. కాగా అక్రమాలకు పాల్పడిన కంప్యూటర్ ఆపరేటర్లను తొలగిస్తున్నారన్న విషయం మంగళవారం మధ్యాహ్నం నుంచే (మిగతా 6వ పేజీలో)

రేపు హనుమజ్జయంతి

- భక్తుల రాక కోసం భద్రాద్రిలో భారీ ఏర్పాట్లు
- 1.50 లక్షల లడ్డూలు సిద్ధం చేసిన అధికారులు

భద్రాచలం, మే 20 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతిని పురస్కరించుకొని ప్రసిద్ధ రామక్షేత్రమైన భద్రాచలంలో గురువారం భారీగా భక్తులు తరలివస్తారని దేవస్థానం అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే హనుమాన్ భక్తుల రాక ప్రారంభం కాగా రాబోయే రెండు రోజుల్లో మరింత తారాస్థాయికి చేరే అవకాశం ఉందని అధికారులు అంచనాతో ఉన్నారు. రాబోయే మూడు రోజుల్లో భద్రాద్రికి భారీగా హనుమాన్ భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రతి ఏటా హనుమజ్జయంతికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడం జరుగుతోంది. ఇందులో ప్రధానంగా తెలంగాణలోని వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర ఉమ్మడి జిల్లాల నుంచి భారీ ఎత్తున భక్తులు తరలిరావడం జరుగుతుంది. ఇందుకోసం దేవస్థానం అధికారులు భద్రాద్రి రామాలయంలో, ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లు, ప్రసాద విక్రయాలు తదితర అంశాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా 12 ప్రసాద కౌంటర్లను దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా లక్షన్నర లడ్డూలను ఇప్పటికే సిద్ధం చేయగా బుధవారం హనుమాన్ భక్తుల రాక ఆధారంగా లడ్డూ తయారీ చేపడతామని దేవస్థానం వర్గాలు తెలిపాయి.

రామబంటుకు రామానుగ్రహం

భద్రాద్రి దేవస్థానం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన ఈవో



భద్రాద్రి దేవస్థానం తరపున పట్టువస్త్రాలను అందజేస్తున్న ఈవో

భద్రాచలం, మే 20 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతిని పురస్కరించుకొని కొండగట్టులోని ఆంజనేయస్వామికి భద్రాద్రి రామయ్య అనుగ్రహం అందించారు. దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఆధ్వర్యంలో వైదిక పరిపాలన అధికారులు, సిబ్బంది తరలివెళ్లి, మంగళవారం ఆంజనేయస్వామి వారికి పట్టువస్త్రాలు, శేష వస్త్రం, శేష మాలిక, ప్రత్యేక ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు కొండగట్టు దేవస్థానం చేరుకున్న వారికి అక్కడి దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా పలికారు. అనంతరం శిరస్సుపై స్వామి వారి పట్టు వస్త్రాలు ధరించి గిరి ప్రదక్షిణ నిర్వహించిన అనంతరం పట్టు వస్త్రాలను కొండగట్టు దేవస్థానం అర్చకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో వెంట భద్రాద్రి దేవస్థానం పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా, ముఖ్య అర్చకులు పొడిచేటి రామభద్రాచార్యులు, అమరవాది శ్రీకాంతాచార్యులు పాల్గొన్నారు.



ఎరువులకు ప్రతిపాదన..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 40,625 మెట్రిక్ టన్నుల యూరియా, 10,978 మెట్రిక్ టన్నుల డీఏపీ అవసరం ఉండగ వాటి కోసం ప్రభుత్వానికి వ్యవసాయశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అదేవిధంగా వరి, మొక్కజొన్న, పత్తి విత్తనాలకు ప్రతిపాదనలు చేశారు. ఆయిల్‌పామ్ కోసం కూడా మొక్కలు నాటేందుకు కూడా ప్రభుత్వం సిద్ధం చేసింది. దీంతోపాటు మునగ విత్తనాలకు కూడా ప్రతిపాదనలకు సిద్ధం చేశారు. జిల్లాలో ఈ ఏడాది పత్తిపంట 2,04,632 ఎకరాలు, వరి 1,65,956 ఎకరాలు, మొక్కజొన్న 86,544 ఎకరాలు, ఆయిల్‌పామ్ 75,000 ఎకరాలు, జీడి మామిడి 11,903 ఎకరాలు, మిర్చిపంట 10,489 ఎకరాలు, పెసళ్లు 128 ఎకరాలు, మినుములు 840 ఎకరాలు, కందులు 1136 ఎకరాల్లో ఈ వర్షాకాలం పంటకు సాగు చేసేందుకు ప్రధాన పంటలు పండించుకునేందుకు వ్యవసాయ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు.

ఆయిల్‌పామ్.. మునగ...

రెండు పంటలపైనే వ్యవసాయ అధికారుల ఫోకస్

- వానాకాలం సీజన్‌కు ముందస్తు ప్రణాళికలు సిద్ధం
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 6 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- ఎరువులు, విత్తనాలకు ప్రతిపాదనలు
- ఇప్పటికే దుక్కులు దున్నుతున్న రైతాంగం

కొత్తగూడెం, మే 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సీజన్ రానప్పటికీ వ్యవసాయశాఖ అధికారులు ముందస్తుగా ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పూర్తి ఏజెన్సీ గిరిజన ప్రాంతాలతో నిండి ఉంది. ఒక పక్కన ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా భూములు.. మరో పక్క వ్యవసాయ భూములు కలిపి ఉన్నాయి. అయితే జిల్లాలో ప్రధానంగా పత్తి, మిర్చి, వేరుశనగ, మొక్కజొన్న ఇతరత్రా పంటలు రైతాంగం అధికంగా పండిస్తారు.

గతంలో అక్కడక్కడ పామాయిల్ పంటను వేసినప్పటికీ ఈ ఏడాది జిల్లాలో ఆయిల్ పామ్, మునగ పంటలపై అధికారులు అధికంగా ఫోకస్ పెట్టారు. ఇప్పటికే ఈ సీజన్ కోసం ఎరువులు, విత్తనాలు ముందుగానే తెప్పించేందుకు వ్యవసాయ శాఖాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సైతం చేశారు. వాస్తవంగా వేసవికాలం ముగియనప్పటికీ విచిత్రంగా వేసవి కాలంలో వర్షాకాలంగా మారింది. జిల్లాలో మే నెలలో మండుతున్న ఎండలు ఉండాల్సి ఉండగా ఈ నెలలో అకాల వర్షాలు కురవడం వల్ల ఎండలు మాయమై ఉష్ణోగ్రతలు లేకుండా చల్లదనం ఏర్పడింది. అప్పుడప్పుడు కాస్త ఎండ ఉన్నప్పటికీ ఉక్కపోతలు అధికం కావడంతో ఇటీవల కురిసిన వర్షాల మూలంగా వేసవికాలం సీజన్ మారిపోయి వ్యవసాయ సీజన్ త్వరలోనే రానున్నట్టు కనిపిస్తోంది. ఇప్పటికే రైతులు తమ పంట పొలాలను దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు.

వాస్తవంగా వ్యవసాయ సీజన్‌లోనే వర్షాలను చూసి రైతులు తమ పంట భూముల్లో అదును సమయంలో విత్తనాలు నాటితే రైతులు నష్టపోయే ప్రమాదం ఉండదు. అరకొర వర్షాలతో ఏకంగా దుక్కులు దున్ని విత్తనాలు నాటితే చివరకు రైతులే నష్టం చూసే అవకాశాలు లేకపోలేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని ఎలాంటి నష్టం జరగకుండ విత్తనాలను సక్రమంగా వర్షాలు కురిసి అదునుగా ఉన్న సమయంలోనే నాటే పరిస్థితులను (మిగతా 6వ పేజీలో)





మల్కం వెంకటేశ్వర్లు (ఫైల్)

ఆనందం మరువకముందే

- కుమార్తె ఓణీ వేడుక మరుసటి రోజే తండ్రి మృతి

జూలూరుపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి):కుమార్తెకు ఓణీల వేడుక చేసి ముచ్చట పడ్డాడు ఆ తండ్రి. తన బంగారు తల్లిని చూసి మురిసిపోయాడు. కానీ ఆ ఆనందం ఒకరోజులోనే ఆవిరైంది. కుమార్తె శుభకార్య వేడుక మరుసటి రోజే గుండెపోటుతో తండ్రి హఠాన్మరణం చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ సంఘటన జూలూరుపాడు మండలంలోని అనంతారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే అనంతారం గ్రామానికి చెందిన మల్కం వెంకటేశ్వర్లు (55), పవిత్ర దంపతులకు నాగప్రసన్న, నాగపంచమి ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె నాగపంచమికి సోమవారం ఓణీల వేడుక నిర్వహించారు. బంధువులతో ఆనందంగా గడిపారు. మంగళవారం ఉదయం వెంకటేశ్వర్లుకు బాత్రూంలో గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు ఆయనను జూలూరుపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా వైద్యుడు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంకటేశ్వర్లు జూలూరుపాడులోని సెయింట్ ఆంథోని పాఠశాల బస్ డ్రైవర్. అతని మృతితో భార్య, కుమార్తెలు కన్నీటి పర్యంతమయ్యారు.

విత్తనాల కొరత సృష్టించొద్దు

- విక్రయాల్లో నిబంధనలను పాటించాలి
- రైతులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు
- విత్తనాల డీలర్లతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో ఏ ఒక్కరైతు కూడా ఇబ్బంది పడవద్దు. విత్తనాల కృత్రిమ కొరత సృష్టించొద్దు. కచ్చితంగా నిబంధనలు పాటిస్తూ విత్తనాలు, ఎరువులు అమ్మకాలు సాగించాలి. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం..' అని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విత్తనాల విక్రయం, ఈ పాస్ యంత్రాల (మిగతా 6వ పేజీలో)



డీలర్లతో సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సిరులు కురిపిస్తున్న సన్న ధాన్యం

- ఇప్పటి వరకు రూ.39.95 కోట్ల బోనస్ చెల్లింపు
- 8976 మంది రైతులకు లబ్ధి

ఖమ్మం కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సన్నధాన్యానికి సిరులు కురిపిస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు లక్షా 60 వేల 853 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, వీటిలో 84,601 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం ఉంది. 8976మంది రైతులకు ఇప్పటి వరకు 39.95కోట్లు అధికారులు చెల్లించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నధాన్యం సాగు చేసిన రైతులకు భరోసా కల్పించేందుకు కొనుగోలు కేంద్రంలో విక్రయాలు సాగించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తోంది. గతేడాది వానాకాలం, యాసంగి పంటలకు ఈ పథకం వర్తింపజేయటంతో గ్రామీణ ప్రాంతాల రైతులు (మిగతా 6వ పేజీలో)



మిల్లుకు తరలిస్తున్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్వో చందన్‌కుమార్

రేపు భద్రాద్రి జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు

జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఈశ్వర్

చుంచుపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి):భద్రాద్రి కొత్తగూడెం జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలను గురువారం నిర్వహిస్తున్నట్లు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జి.ఈశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన బాక్సర్లు ఉదయం 7 గంటల లోపు కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు హాజరు కావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మంచిర్యాల జిల్లాలో జరిగే టైసన్ కప్ స్టేట్ ఓపెన్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా జట్టు తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్, యూత్ విభాగాల్లో ఈ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో జూనియర్ కేటగిరిలో 45 కేజీల నుంచి 60 కేజీల ఏడు విభాగాల్లో పోటీలను నిర్వహించి రాష్ట్ర జట్టును ఎంపిక చేస్తారని తెలిపారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారిని గోవాలో జరిగే జాతీయ ఓపెన్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని వెల్లడించారు. పూర్తి వివరాలకు 7893669676 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ కేసులను సత్వరమే పరిష్కరించాలి

సమీక్ష సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కేసులను సమీక్షిస్తూ సత్వరమే పరిష్కరించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి కమిటీ సభ్యులకు, పోలీస్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. బాధితులకు పరిహారం పెంపునకు చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువవికాసం లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా చేపట్టామన్నారు. పార్టీలకతీతంగా అర్హులకు పథకాల లబ్ధి అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే అన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులపై వెంటవెంటనే విచారణ నిర్వహించి తగినచర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో చర్చించిన విషయాలపై తీసుకున్న చర్యల నివేదికలను అందజేయాలన్నారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సమావేశాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. పరిష్కరించాల్సిన సమస్యలను తర్వాతి సమావేశంలో లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 735 నమోదవగా, 29 కేసులు ఎఫ్ఐఆర్, 101 కేసులు ఛార్జీషీట్, 562కేసులు జడ్జిమెంట్ అవ్వగా మిగతా కేసులు విచారణలో ఉన్నాయన్నారు. 713కేసులకు పరిహారం మంజూరు అయిందన్నారు. ఇందులో 247 ఎస్టీ బాధితులు, 532 ఎస్సీ బాధితులు, మొత్తంగా 779మంది బాధితులకు రూ.11కోట్ల 16 లక్షల 68 వేల పరిహారం మంజూరు అయినట్లు తెలిపారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాసం పథకంలో ఎస్సీ యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు మళ్లింపు జరగకుండా చూడాలన్నారు. కార్పొరేట్ కళాశాల, పాఠశాలల్లో ప్రభుత్వం ద్వారా ఎస్సీ, ఎస్టీ పిల్లలకు ఉచిత విద్యా పథకం పటిష్ఠంగా అమలుచేయాలని, కళాశాలలు, పాఠశాలలకు ఫీజు రియింబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించాలన్నారు. కులాంతర వివాహాలకు ప్రోత్సాహకాలను చెల్లించాలన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ నరేష్ కుమార్, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి కె.సత్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎస్.విజయలక్ష్మి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఏ.శ్రీనివాస్, ఆర్డీవోలు నర్సింహారావు, ఎల్.రాజేందర్ గౌడ్, ఏసీపీలు ఎంఏ రహమాన్, రఘు, తిరుపతిరెడ్డి, కమిటీ సభ్యులు వీరభద్రయ్య, జె.దాస్ మహరాజ్, టి.అంజయ్య, కె.రాంబాబు, అన్నం శ్రీనివాసరావు, ఎం.వెంకట్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ స్వామి పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



కారుణ్య నియామకం పత్రాలను అందజేసిన జీఎం షాలెం రాజు

సింగరేణి అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలి

సింగరేణి జనరల్ మేనేజర్ షాలెం రాజు

రుద్రంపూర్, (సింగరేణి) మే 20 (ఆంధ్రజ్యోతి):సింగరేణి సంస్థలో కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలో చేరిన కార్మికులు సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెంరాజు కోరారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తే అందరి లక్ష్యం కావాలని ఆకాంక్షించారు. మంగళవారం కొత్తగూడెం ఏరియాలో కారుణ్య నియామకాల ద్వారా నియమితులైన 19 మందికి నియామకపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించి సంస్థ పురోభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలన్నారు. కార్మికుల వారసులుగా సంస్థను అభివృద్ధి పథంలో నడిపేందుకు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని కోరారు. గైర్హాజరు లేకుండా విధులు నిర్వహించి సంస్థను అభివృద్ధి చేయడంతోపాటు కుటుంబాలను సైతం ప్రగతిపథంలో నడపాలన్నారు. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాల్లో చేరిన యువతకు సింగరేణి సంస్థలో విద్యార్హతను బట్టి పదోన్నతులు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లిఖార్జున్‌రావు, ఎండీ రజాక్, ఎస్ఓటూ జీఎం జీవీ.కోటిరెడ్డి, డీజీఎం శివకేశవరావు, పర్సనల్ అధికారి మురళీ పాల్గొన్నారు.

పెన్షన్లు ఇప్పించండి మహా ప్రభో..

- ఆసరా పెన్షన్ల కోసం వృద్ధుల వేడుకోలు
- అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన

కరకగూడెం, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా.. మాకు పెన్షన్ ఇప్పించే వారే కరువయ్యారని మండలంలోని వితంతువులు, ఒంటరి మహిళలు ఆరోపిస్తున్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ... మండలంలోని వందల మందికి ఆసరా పెన్షన్లు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారు. పెన్షన్ కోసం కార్యాలయ లు, అధికారులు, రాజకీయ నాయకుల చుట్టు తిరుగుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారని వాపోతున్నారు. మాకు పెన్షన్లు ఇప్పించండి మహా ప్రభూ అని వేడుకుంటున్నారు. మండలంలోని 16 పంచాయతీల్లో ఇప్పటివరకు 1982 మందికి పెన్షన్లు వస్తున్నాయి. ఇందులో వితంతు 689, వృద్ధాప్య పెన్షన్లు 979, వికలాంగుల పెన్షన్లు 234, ఒంటరి మహిళలు 78, చేనేత కార్మికులకు 2 వస్తున్నాయి. మండల వ్యాప్తంగా ఇంకా సుమారు 165మందికి పెన్షన్లు రావడం లేదు. ఇందులో సుమారు వృద్ధులు 75, ఒంటరి మహిళలు 40, వితంతులు 20, వికలాంగులు 10 మంది ఉన్నారు.

ఆన్‌లైన్ సమస్యలున్నాయి : ఎంపీడీవో

గత ప్రభుత్వం నుంచి నేటి వరకు ఆన్‌లైన్ సమస్యలు ఉండటం వల్ల అర్హులైన పెన్షన్ దారులకు పెన్షన్ రావడం లేదు. ఇప్పటికే మండలంలో 165 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్ సర్వీసులు ప్రారంభిస్తే అర్హులైన ప్రతీ ఒక్కరికి పెన్షన్లు అందిస్తాం.

పెన్షన్ ఇప్పించాలి

ఊకె లక్ష్మి, పోలకమ్మతోగు గ్రామం, చిరుమళ్ళ పంచాయతీ



నా భర్త చనిపోయి రెండేళ్ల అవుతోంది. పలు మార్లు అధికారుల చుట్టు తిరిగి వారు అడిగిన కాగితాలు ఇచ్చా. ఇప్పటికీ పెన్షన్ రావడం లేదు. ప్రజా పాలనలో కూడా దరఖాస్తు చేశా. త్వరలో ఇస్తామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు పెన్షన్ ఇప్పించాలి.

కుటుంబ పోషణకు ఇబ్బందులు

ఫాతిమా, ఒంటరి మహిళ,కరకగూడెం



నా భర్త అనారోగ్యంతో మృతి చెంది రెండేళ్లు అవుతోంది. ఇద్దరు పిల్లలతో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం పెన్షన్ ఇస్తుందని దరఖాస్తు చేసుకున్న. నేటికీ పెన్షన్ రావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే పెన్షన్ అందించాలి.

కనకమ్మ స్ఫూర్తితో ఉన్నతంగా ఎదగాలి..

ఆదివాసి ఆణిముత్యం కనకమ్మను సన్మానించిన తుడుందెబ్బ నాయకులు

కొత్తగూడెం టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ఆణిముత్యం మట్టా కనకమ్మ స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నతంగా ఎదిగి ఆదివాసీ జాతికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు ననపా కోటేశ్వరరావు కోరారు. సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కనకమ్మను మంగళవారం ఘనంగా సన్మానించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ఆదివాసీ ఆణిముత్యం స్టేనో నుంచి సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్‌గా ఎదిగిన మట్టా కనకమ్మ అనే శీర్షికతో వచ్చిన కథనానికి ఆదివాసీ నాయకులు స్పందించి కనకమ్మను కలిసి పూలమాలలతో సత్కరించారు. ఆమె బాల్యం నుంచి విద్యాభ్యాసం పూర్తయిన ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో ఎలాంటి సదుపాయాలు లేనప్పటికీ గిరిజన సంక్షేమ హాస్టల్‌లో కష్టపడి విద్యను అభ్యసించి ఉన్నతంగా ఎదిగారని ఆమె స్ఫూర్తితో ఆదివాసీలంతా అక్షరాస్యులుగా ఎదగాలన్నారు. చదువు ద్వారానే సమాజంలో గౌరవం లభిస్తుందని తెలిపారు. సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్‌గా సేవలు అందజేస్తున్న కనకమ్మను అభినందించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డివిజన్ తుడుందెబ్బ అధ్యక్షుడు పాయం లక్ష్మీనర్సు, చుంచుపల్లి మండల అధ్యక్షుడు కోరం కృష్ణయ్య, నాయకులు వర్సా నర్సింహారావు, తాటి పుల్లయ్య పాల్గొన్నారు.



కనకమ్మను సన్మానిస్తున్న తుడుందెబ్బ నాయకులు



కీర్తనలు ఆలపిస్తున్న చిన్నారులు

రామదాసు కీర్తనలు ఆలపించిన చిన్నారులు

దుమ్ముగూడెం మే 20 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాలయ ప్రాంగణంలో హైదరాబాద్ ఊహిత మ్యూజిక్ అకాడమి చిన్నారులు మంగళవారం భక్తరామదాసు కీర్తనలను ఆలపించారు. సీతారామచంద్రస్వామి వారిని కీర్తిస్తూ ఆలపించిన పాటలు చూపరులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు భవిష్యత్తులో మరెన్నో అద్భుతమైన కీర్తనలు ఆలపించి ఉన్నతశిఖరాలకు చేరాలని ఆలయ ఇన్‌చార్జ్ అనీల్‌కుమార్ అన్నారు. ఎప్పుడు కోరినా రాములవారి కీర్తనలను పాడేందుకు తమ బృందం సిద్ధంగా ఉంటుందని మ్యూజిక్ అకాడమి చైర్మన్ మెండెం రామారావు తెలిపారు. కీర్తనలు పాడేందుకు తమ బృందానికి సహకరించిన ఆలయ ఈవో రమాదేవి, పర్ణశాల ఆలయ ఇన్‌చార్జ్ అనీల్ కుమార్లకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమార్కులపై కొరడా

(5వ పేజీ తరువాయి)

కేఎంసీలో చర్చ జరగగా.. అందులో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు అందరూ అసిస్టెంట్ కమిషనర్ ఛాంబర్ ముందు క్యూ కట్టడం గమనార్హం. కేఎంసీలోని రెవెన్యూ విభాగంలో అక్రమాలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చిన విషయం విధితమే. అంతేకాదు కొత్తవారు వచ్చినప్పటికీ పాత పద్ధతుల్లోనే అక్రమాలకు పాల్పడుతున్నారని, ఖాళీ స్థలాలకు దర్జాగా అసెస్‌మెంట్లు వేస్తున్నారని, ఆరు వేల గజాల స్థలంలో అసెస్‌మెంట్ వేసిన అంశాలను, రాతిదర్వాజ ప్రాంతంలో లేని నిర్మాణం ఉన్నట్టుగా చూపి అసెస్‌మెంట్ వేశారని, వాస్తవంగా ప్రాంతాన్ని పరిశీలించాల్సిన ఆర్ఐలు, ఇతర సిబ్బంది తిరస్కరించినప్పటికీ వాటికి అప్రూవల్ ఇచ్చి ఇంటి నెంబర్లు కేటాయించారంటూ వరుస కథనాలు ప్రచురించిన విషయం విధితమే. ఈ క్రమంలో కేఎంసీ రెవెన్యూ విభాగంలో ప్రక్షాళన ప్రారంభం కావడంతో ఆంధ్రజ్యోతి కథనాలు చర్చనీయాంశంగా మారాయి. మరికొద్ది రోజుల్లో ఇతర విభాగాల్లో సైతం ఇదే తరహా విచారణ నిర్వహించి కొందరు సిబ్బందిపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోంది.

ఆయిల్‌పామ్.. మునగ...

(5వ పేజీ తరువాయి)

గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా వ్యవసాయ శాఖాధికారులు రైతాంగానికి సరైన అదును సమయంలోనే విత్తనాలు నాటాలని అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతేడాది కంటే ఈసారి అదనంగా పంటల సాగు చేసే విధంగా వ్యవసాయశాఖాధికారులు ముందస్తుగా ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ ఏడాది 6,09,622 ఎకరాల్లో పంటలు సాగు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. అయితే గతేడాది వర్షాకాలం సీజన్‌లో 5,92,264 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. గతేడాది కంటే ఈ ఏడాది 17,358 ఎకరాల్లో అదనంగా పంటలు సాగు చేసేందుకు ప్రణాళికలను రూపొందించారు. ప్రధానంగా ఈ ఏడాది ఆయిల్‌పామ్, మునగ వ్యవసాయ పంటలపై దృష్టి సారించి పెద్ద ఎత్తున సాగుచేయాలని కూడా జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఫోకస్ పెట్టింది. ఇప్పటికే జిల్లాలో 41,489 క్వింటాలు వరి విత్తనాలు, 6,924 క్వింటాలు మొక్కజొన్న విత్తనాలు, 51,158 ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. ఆయా మండలాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కూడా వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఎరువులకు ప్రతిపాదన..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 40,625 మెట్రిక్ టన్నుల యూరియా, 10,978 మెట్రిక్ టన్నుల డీఏపీ అవసరం ఉండగ వాటి కోసం ప్రభుత్వానికి వ్యవసాయశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అదేవిధంగా వరి, మొక్కజొన్న, పత్తి విత్తనాలకు ప్రతిపాదనలు చేశారు. ఆయిల్‌పామ్ కోసం కూడా మొక్కలు నాటేందుకు కూడా ప్రభుత్వం సిద్ధం చేసింది. దీంతోపాటు మునగ విత్తనాలకు కూడా ప్రతిపాదనలకు సిద్ధం చేశారు. జిల్లాలో ఈ ఏడాది పత్తి పంట 2,04,632 ఎకరాలు, వరి 1,65,956 ఎకరాలు, మొక్కజొన్న 86,544 ఎకరాలు, ఆయిల్‌పామ్ 75,000 ఎకరాలు, జీడి మామిడి 11,903 ఎకరాలు, మిర్చి పంట 10,489 ఎకరాలు, పెసళ్లు 128 ఎకరాలు, మినుములు 840 ఎకరాలు, కందులు 1136 ఎకరాల్లో ఈ వర్షాకాలం పంటకు సాగు చేసేందుకు ప్రధాన పంటలు పండించుకునేందుకు వ్యవసాయ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు.





హాజరైన విత్తన డీలర్లు, అధికారులు

విత్తనాల కొరత సృష్టించొద్దు

(5వ పేజీ తరువాయి)

వినియోగంపై రిటైలర్లతో నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విత్తనాల డీలర్లు నిబంధనలు పాటిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలన్నారు. ఈ సీజన్‌లోనూ ఎలాంటి పొరపాట్లు జరగకుండా మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వానాకాలం సాగుకు అవసరమయ్యే విత్తనాలు ఏ ప్రాంతంలో ఎంత డిమాండ్ ఉంటుందో అంచనా వేసి దానికి అనుగుణంగా అక్కడ ఆ విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. రైతులంతా ఒకేసారి నాట్లు వేయకుండా, ప్రణాళిక ప్రకారం నాట్లు జరిగేలా చూడాలని, ప్రతి మండలం పరిధిలో ఎప్పుడు నాట్ల ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్ తయారు చేసుకోవాలని, వరియేతర పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

రైతులకు విత్తనాలు అమ్మే సమయంలో నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలన్నారు. విత్తనాల బ్యాగ్‌పై లేబుల్, నిల్వ చివరి గడువు తేదీ వివరాలకు స్పష్టంగా తెలియజేసి అమ్మాలని అన్నారు. విత్తనాల అమ్మకం రికార్డ్ వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. విత్తనాలను లైసెన్స్ ఉన్న డీలర్లు, రిటైలర్లు మాత్రమే విక్రయించాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ క్లస్టర్ పరిధిలో ఎవరైనా అనధికారంగా విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

క్రాప్ బుకింగ్ సమయంలో ప్రతి రైతు దగ్గర విత్తనాలు ఎక్కడి నుంచి వచ్చాయో వివరాలు సేకరించాలని కలెక్టర్ ఏఈవోలకు సూచించారు. జిల్లాలో విత్తనాల షాపుల తనిఖీ షెడ్యూల్ రూపొందించాలని, ఒక చెక్ లిస్ట్ తయారు చేసుకుని, ప్రతి షాపును పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని కలెక్టర్ తెలిపారు. నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే సంబంధిత డీలర్ల నుంచి రైతులకు శాస్త్రీయంగా నష్టపరిహారం అంచనా వేసి చెల్లించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. నకిలీ విత్తనాలు ఎవరైనా అమ్ముతున్నట్లు డీలర్లకు తెలిస్తే వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి ఎంవీ.మధుసూదన్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వాసవిరాణి, వెంకటేశ్వరరావు, విజయచంద్ర, సరిత, మండల వ్యవసాయ అధికారులు, ఫెర్టిలైజర్ రిటైలర్లు పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తున్న సన్న ధాన్యం

(5వ పేజీ తరువాయి)

ఎక్కువగా బోనస్‌ను సద్వినియోగం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఏ-గ్రేడ్ రకం సన్న ధాన్యం క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధరగా నిర్ణయించారు. సన్నధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతుధరతోపాటు క్వింటాకు బోనస్ ద్వారా రూ.500 కలిపి రూ.2,820 రైతులకు చెల్లిస్తుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దశల వారీగా రైతుల ఖాతాల్లో జమ

చందన్‌కుమార్, డీఎస్వో

సన్న ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు జరిపిన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచిన తర్వాత దశలవారీగా బోనస్‌తో కలిపి చెల్లింపులు చేస్తున్నాం. వానాకాలం సీజన్లో పూర్తిగా బోనస్ చెల్లింపులు జరిగాయి. యాసంగిలో ముందస్తుగా అమ్మిన రైతుల ఖాతాలో ఇప్పటికే జమ చేస్తున్నాం. ఇప్పటివరకు రూ.39.95 కోట్లు జమ చేశాం.



గత మూడేళ్లుగా రబీలో సేకరించిన ధాన్యం(మె. టన్నుల్లో)

2021-22	:73,967.800
2022-23	:1,27,200.680
2023-24	:21,844.360
2024-25 ఇప్పటి వరకు	:1,60,853.040

జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం

సన్నధాన్యం	:84,601.240 మె.టన్నులు
ఏ గ్రేడ్	:4545.760 మె.టన్నులు
కామన్ రకం	:71,706.040 మె.టన్నులు
మొత్తం	:1,60,853.040 మె. టన్నులు
బోనస్ అందుకున్న రైతులు	:8,976
బోనస్ మొత్తం	:39.95 కోట్లు

ఆదివాసీలకు అండగా ఉంటాం

- ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

చర్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లోని ఆదివాసీలకు పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం చర్ల మండలంలోని చెన్నాపురం గ్రామంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ సూచనలతో ఆదివాసీలకు విద్య, వైద్యం రవాణా అందించడంలో చర్ల పోలీసులు ఎప్పుడూ ముందుంటున్నారని అన్నారు. మండలంలోని నిరుపేదలు, అటవీగ్రామాల్లోని ఆదివాసీలకు మెరుగైన సైకర్యాలు కల్పిస్తున్నామని గుర్తు చేశారు. మావోయిస్టులకు ఎవ్వరూ సహకరించవద్దని సూచించారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందించాలన్నారు. అంతకు ముందు గ్రామంలోని ప్రతీ ఇంటినీ పోలీసులు తనిఖీలు చేశారు. అనుమానంగా కనిపించిన వారిని ప్రశ్నించి వదిలేశారు. గ్రామస్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, చిన్నారులకు దుస్తులు అందజేశారు. యువకులకు వాలీబాల్ కిట్లు అందించారు. అనంతరం చర్ల సీఐ రాజు వర్మ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారికి సహాయం అందించేందుకు చర్ల పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుందన్నారు. మావోయిస్టులకు సహకరించి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో చర్ల ఎస్ఐలు నర్సిరెడ్డి, కేశవ, స్పెషల్ పార్టీ పోలీసులు ఉన్నారు.



దుస్తులు అందజేస్తున్న ఏఎస్పీ

సాగు.. ఇక బహుబాగు!



సీతారామ పంప్‌హౌజ్

(5వ పేజీ తరువాయి)

పోసుకునేవారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కృష్ణా పరీవాహకంలో భారీవర్షాలు కురిసి తుంగభద్ర, ఆల్మట్టి, శ్రీశైలం, నాగార్జునసాగర్ నిండిన తర్వాత ఎడమ కాలువ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు నీరు విడుదల చేసేవారు. పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ ఎడమకాలువకు నీరు విడుదల చేస్తేనే పాలేరు, ఖమ్మం, వైరా, సత్తుపల్లి మధిర నియోజకవర్గాలకు సాగునీరు లభించి వరినాట్లు వేసేవారు. దీనివల్ల పంట కాలం కొంత ఆలస్యమయ్యేది. ఇప్పుడు సీతారామ ద్వారా జూన్, జూలై నెలల్లోనే గోదావరి జలాలు వదిలితే వైరా రిజర్వాయర్ నుంచి ఆ మూడు నియోజకవర్గాలతో పాటు సీతారామ కాలువ ప్రవహించే నియోజకవర్గాల్లోని పొలాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఇక సీతారామ ప్రధాన కాలువకు తూములు ఏర్పాటు చేసి డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌తో ప్రధాన కాలువ పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో నీరు విడుదల చేయాలని నీటి పారుదలశాఖ ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే టెండర్ల ప్రక్రియలో జాప్యంతో ఈ సీజన్‌లో అది అమల్లోకి వచ్చే అవకాశం లేదు.



ట్రాక్‌ను పరిశీలిస్తున్న పీవో

క్రీడా ప్రాంగణాల్లో అన్ని సదుపాయాలుండాలి

▸▸ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్

దుమ్ముగూడెం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు క్రీడా ప్రాంగణాల్లో అన్ని సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని ఐటీడీఏ పీవో బి. రాహుల్ అన్నారు. మంగళవారం ములకపాడు క్రీడాప్రాంగణంతో కమ్యూనిటీహాల్, ఇండోర్ స్టేడియం, రన్నింగ్ ట్రాక్‌లను పరిశీలించారు. క్రీడాప్రాంగణం పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఆర్మీ, పోలీస్, అటవీశాఖ తదితర శాఖల్లో ఉద్యోగాల కోసం శిక్షణ పొందే యువకులకు 400 మీటర్ల రన్నింగ్‌ట్రాక్ ఎంతో అవసరమని అన్నారు. రూ. 10లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. క్రీడాప్రాంగణంలోని అన్ని రకాల నిర్మాణ పనులు పది కాలాలపాటు నిలిచేలా నాణ్యవంతంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్‌వెల్ఫేర్ ఈఈ చంద్రశేఖర్, టీఏ శ్రీనివాస్, ఏఈ రవి తదతరులు పాల్గొన్నారు.

కళల పట్ల మక్కువ చూపించాలి: పీవో

భద్రాచలం, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువు, క్రీడలతో పాటు కళల పట్ల కూడా మక్కువ చూపించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని కేజీబీవీలో ఈ నెల 5 నుంచి 15 రోజుల పాటు జరిగిన సమ్మర్ క్యాంపు ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ 15 రోజులు సమ్మర్ క్యాంపుల్లో విద్యార్థినులు నేర్చుకున్న అంశాలను ఇంట్లో సాధన చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వరచారి, ఎంఈవో రమ, కొత్తగూడెం జీసీడీవో అన్నామని పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

▸▸ జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ



నియమాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీటీవో

చుంచుపల్లి, మే20(ఆంధ్రజ్యోతి): ప్రతీ పాఠశాల, కళాశాల బస్సు తప్పక ఫిట్‌నెస్ కలిగి ఉండాలని భద్రాద్రి జిల్లా డీటీవో వెంకటరమణ డ్రైవర్లకు సూచించారు. మంగళవారం కొత్తగూడెం ఆర్‌టీవో యూనిట్ కార్యాలయంలో డ్రైవర్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని పాటించాల్సిన నియమ, నిబంధనలను వివరించారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతీ డ్రైవర్ వాహనం నడిపే ముందు ఫిట్‌నెస్ చూసుకోవాలని, అనంతరమే పిల్లలను బస్సులలోకి ఆహ్వానించాలని అన్నారు. ప్రతీ వాహనానికి అటెండెంట్ ఉండాలని, ప్రతీ నెల డ్రైవరు తమ ఆరోగ్యం చెకప్ చేసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, చట్ట ప్రకారం నడుచుకోవాలని పాఠశాల, కళాశాల డ్రైవర్లు బాధ్యతగా మెలగాలని కోరారు. బస్సు పాటించవలసిన నియమాలకు సంబంధించిన కరపత్రాలు డ్రైవర్లతో కలిసి ఆవిష్కరించారు.

రేపు వాహనాల వేలంపాట

భద్రాచలం, మే 20 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో గురువారం వాహనాల వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు ఉదయం ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

కరాటేతో గిరాటేయొచ్చు

వేసవి సందర్భంగా ఏర్పాటు చేసిన కరాటే శిక్షణ శిబిరాల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పుస్తకాలను సెలవుల్లో పక్కన పెట్టి యుద్ధవిద్యతో కుస్తీపడుతున్నారు. నడుముకు బెల్టులు కట్టుకుని జపనీస్ కరాటే విద్యను ఓ పట్టుపడుతున్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి బాటలు వేసుకుంటున్నారు.





ఖమ్మంలోని వేసవి శిబిరంలో కరాటే శిక్షణ

▸▸ ఉత్సాహంగా కరాటే శిబిరం
▸▸ వేసవి ఆత్మరక్షణ శిబిరంపై విద్యార్థుల ఆసక్తి
▸▸ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న 24 క్యాంపులు

ఖమ్మం స్పోర్ట్స్, మే 20(ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరుగుతున్న కరాటే వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. స్టేడియానికి నిత్యం ఆత్మరక్షణ విద్యలో తర్ఫీదు పొందేందుకు వచ్చే 20 మంది క్రీడాకారులతో పాటు కొత్తగా మరో 30 మంది విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరంలో కరాటే నేర్చుకునేందుకు వస్తున్నారు. స్టేడియంలో సీనియర్ కరాటే కోచ్, అడ్వకేట్ జి. రాము శిక్షణ ఇస్తుండటంతో ఔత్సాహికులు యుద్ధ విద్యను నేర్చుకునేందుకు పోటీ పడుతున్నారు. శిబిరంలో కొత్త క్రీడాకారులకు కోచ్‌తో పాటు సీనియర్ క్రీడాకారులు ఆటలో ఓనమాలు, మెళకువలు నేర్పిస్తున్నారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ అలాంటి క్రీడా శిబిరాలను నగరంలో 22, జిల్లాలోని ఇతర గ్రామీణ ప్రాంతాలలో 23 శిబిరాలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వేసవి సెలవులను వృథా చేయకుండా మరింత మంది చిన్నారులు ఉచిత శిక్షణ శిబిరాలకు రావాలని అధికారులు కోరుతున్నారు.



ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగం
జి. రాము, కరాటే కోచ్

విద్యార్థులు ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి. కరాటే నేర్చుకోవడంతో శారీరక దృఢత్వం పెంపొంది మానసికంగా ఉల్లాసంగా ఉంటారు. ప్రతీ ఒక్కరు చిన్నతనం నుంచే ఆటలు నేర్చుకోవాలి. అప్పుడే వారికి ఆటపై నియంత్రణ వస్తుంది.

మెళకువలు నేర్చుకుంటే ఉపయోగం
లక్ష్మీకోటేశ్వరి, సీనియర్ కరాటే క్రీడాకారిణి

బాలికలు కరాటే ఖచ్చితంగా నేర్చుకోవాలి. వారికి ఎప్పుడైనా ఆకతాయిల నుంచి ప్రమాదం ఎదురైతే కరాటేతో ఆకతాయిని గిరాటేయొచ్చు. క్రీడలో చిన్న చిన్న మెళకువలు నేర్చుకుంటే ఆటలో రాణించవచ్చు. విద్యార్థి దశలోనే క్రీడలు నేర్చుకోవాలి. ప్రస్తుతం చిన్న పిల్లలు ఆట నేర్చుకోవడానికి పోటీ పడటం ఆనందంగా ఉంది. వారికి సీనియర్ క్రీడాకారిణిగా మెళకువలు నేర్పడం నా అదృష్టంగా భావిస్తున్నా.

వైద్యులు తీరు మార్చుకోవాలి

▸▸ పనితీరు మారకుంటే చర్యలు
▸▸ భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్
▸▸ బూర్గంపాడు సీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్



బూర్గంపాడు సీహెచ్‌సీ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

బూర్గంపాడు, మే 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బూర్గంపాడులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) వైద్యుల తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ హెచ్చరించారు. మంగళవారం బూర్గంపాడులోని సీహెచ్‌సీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. వైద్యుల పనితీరుపై అసహనం వ్యక్తం చేసి వారిపై మండిపడ్డారు. జిల్లాలోని ఇతర ఆరోగ్య కేంద్రాలతో పోల్చుకుంటే బూర్గంపాడు సీహెచ్‌సీ పనితీరు బాగాలేదని అన్నారు. ఆస్పత్రిలో వైద్యులు లేక మ్యూజియంగా మారిందని... వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రి ఆవరణలో చేపట్టనున్న నూతన భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. సాధ్యమైనంత త్వరలో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆసత్రిర ఆవరణలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్ ప్రజలకు ఉపయోగపడే విధంగా, దాని వద్దకు దారిని ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం సంజీవరెడ్డిపాలెం గ్రామ శివారులోని గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది కిచెన్‌షెడ్, అదనపు తరగతి గదులు, తాగునీటి, మరుగదొడ్లు, తదితర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జూన్ 10నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ రవిబాబు, సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు, ఎంపీడీవో జమలారెడ్డి, ఐటీసీ మేనేజర్ చెంగళరావు, అధికారులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు అడ్డుకొని ధర్నా చేస్తున్న రైతులు

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల అడ్డగింత

వైరా, మే 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను వైరా మండలంలోని కనకగిరి సిరిపురం రైతులు మంగళవారం అడ్డుకొని ధర్నా చేశారు. తాము పొలాలకు వెళ్లే లింక్ రోడ్లకు అండర్‌పాస్ వంతెనలను తక్కువ ఎత్తులో నిర్మించటాన్ని నిరసిస్తూ రైతులు పనులను అడ్డుకున్నారు. లింక్ రోడ్ల వద్ద ఎక్కువ ఎత్తులో అండర్‌పాస్ వంతెనలు నిర్మించటంలో గ్రీన్‌ఫీల్డ్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ధ్వజమెత్తారు. అండర్‌పాస్ వంతెనలు ఎత్తు తక్కువగా నిర్మిస్తుండటంతో వాటి కింద నుంచి ధాన్యం, వరిగడ్డితో ట్రాక్టర్లు, వరికోత మిషన్లు ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని రైతులు ఆరోపించారు. తొలుత సానుకూలంగా స్పందించిన కాంట్రాక్టర్, అధికారులు ఇప్పుడు అందుకు విరుద్ధంగా తక్కువ ఎత్తులో అండర్‌పాస్ వంతెనలు నిర్మించారని ఇవి తమకు ఎంతో ఇబ్బందికరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను అడ్డుకున్న రైతుల వద్దకు కాంట్రాక్టర్‌కు చెందిన సిబ్బంది చేరుకొని వారి సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. ఈనెల 25వతేదీ నాటికి సమస్య పరిష్కరిస్తామని సిబ్బంది హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మహిళా మార్టుకు మెప్మా సిద్ధం

▸▸ బొమ్మల నుంచి మట్టి వంట పాత్రల దాకా..
▸▸ ఇప్పటి వరకు ఏడు రకాల ఉత్పత్తులు
▸▸ అభినందించిన మేయర్ నీరజ

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 20(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులు కొనుగోలు చేయాలంటే ఇప్పటి వరకు ఎక్కడైనా ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేస్తే అక్కడికి వెళ్లి కొనుగోలు చేయాల్సి వచ్చేది. అయితే కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక చొరవతో అన్ని రోజులు పాటు ఖమ్మం నగరంలో మహిళా స్వయం సహాయక సంఘాలు ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా కార్యాచరణ చేశారు. ఒకటి రెండు కాకుండా కార్పొరేట్ మాల్స్ తరహాలో మహిళా ఉత్పత్తులు అన్ని ఒకే ప్రాంతంలో అమ్మకాలు జరిపేలా ఖమ్మంలో మహిళా మార్టుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఖమ్మం మెప్మా ఆధ్వర్యంలో ఏడు మహిళా స్వయం సహాయక సంఘాలు ఏడు రకాల ఉత్పత్తులను సిద్ధం చేశారు. వాటిని మేయర్ పునుకొల్లు నీరజ కేఎంసీలో పట్టణ లెవల్ ఫెడరేషన్ కార్యాలయంలో పరిశీలించి కొనుగోలు చేశారు.

ఇప్పటి వరకు ఏడు రకాల ఉత్పత్తులు

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(సెర్ప్), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులతో ఖమ్మంలోని వైరా రోడ్డు టీటీడీసీ కార్యాలయం సమీపంలో మహిళా మార్టు ఏర్పాటు కానుంది. 30కు పైగా మహిళా ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. కాగా మంగళవారం నాటికి మెప్మా ఆధ్వర్యంలో పార్వతి, వనిత శ్రీ, సమీనా, వసంత, సాయిబాబా, తేజస్విని, అఖిలా, వీరాంజనేయ మహిళా స్వయం సహాయక సంఘాలకు చెందిన ఏడు రకాల మహిళా ఉత్పత్తులను సిద్ధం చేశారు. మహిళలు చేతితో తయారు చేసిన ప్లాస్టిక్ బొమ్మలు, గాజులు, ఫ్యాన్సీ వస్తువులు, గానుగ నూనెలు, పేపరు ఫిపెన్ ప్లేట్లు, అగరబత్తీలు, డోర్ మ్యాట్స్, మట్టి వంట పాత్రలు ఉన్నాయి.

అభినందించి కొనుగోలు చేసిన మేయర్

మహిళా మార్టు ఏర్పాటుకు సిద్ధమైన మహిళా ఉత్పత్తులను డీఎంసీ సావల సుజాత, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి ఆధ్వర్యంలో కేఎంసీలోని టౌన్ లెవల్ ఫెడరేషన్ కార్యాలయంలో ఉంచారు. మహిళా ఉత్పత్తులను మేయర్ పునుకొల్లు నీరజ పరిశీలించారు. అందమైన బొమ్మలు, గాజులు, ఫ్యాన్సీ వస్తువులు ఆకర్షనీయంగా ఉండటంతో మహిళ సంఘాలను అభినందించారు. బొమ్మలు, ఇతర ఫ్యాన్సీ వస్తువులను మేయర్ కొనుగోలు చేశారు. మహిళా మార్టుకు ఇంకా మహిళా ఉత్పత్తులను పెంచాలని సూచించారు. సీవోలు గోపోజు ఉపేంద్ర, చిలకా ద్రౌపది, బొల్లికొండ రోజా, సిబ్బంది మేకల సంధ్య పాల్గొన్నారు.



ఉత్పత్తులతో మహిళా స్వయం సహాయక సంఘాలు, డీఎంసీ, టీఎంసీ, సీవోలు

తిరంగా యాత్రను అడ్డుకున్న వారిపై కేసు నమోదు చేయాలి

▸▸ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 20(ఆంధ్రజ్యోతి): తిరంగా యాత్రను అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిపై కేసు నమోదు చేయాలని, తిరంగా యాత్రను అడ్డుకొని దాడికి ప్రయత్నించటం వెనుకు కుట్ర కోణం ఉన్నట్లు అనుమానం ఉందని బీజేపి జిల్లా అధ్యక్షుడు నెల్లూరి. కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన సందర్భంగా ఆర్మీ జవాన్లు, ప్రధాని నరేంద్రమోదీలను కీర్తిస్తూ ఖమ్మం నగరంలో అన్ని వర్గాల ప్రజలతో తిరంగా యాత్రను నిర్వహిస్తుంటే ఓ మతానికి చెందిన యువకులు ర్యాలీని విచ్ఛిన్నం చేసే దిశగా దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని అన్నారు. జవాన్లను కీర్తిస్తూ అభిమానాన్ని చాటుకుంటున్న జాతీయవాదులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు బీజేపీ కట్టుబడి ఉంటుందని, వాటిని విచ్ఛిన్నం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇద్దరు వ్యక్తుల అనాలోచిత వ్యవహారం మతాల మధ్య చిచ్చు పెట్టే వరకు వచ్చిందని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ నాయకులు నున్నా రవికుమార్, ఈవీ రమేష్, సన్నే. ఉదయ్‌ప్రతాప్, అల్లిక. అంజయ్య, రవి రాథోడ్, బెనర్జీ, వెంకటరమణ పాల్గొన్నారు.

శాంతియుత దేశభక్తి కోసమే తిరంగా యాత్ర

▸▸ పొంగులేటి సుధాకర్‌రెడ్డి

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 20(ఆంధ్రజ్యోతి): శాంతియుత దేశభక్తి కోసమే తిరంగా యాత్రలని భావోద్వేగాలకు లోనుకాకుండా శాంతిని పాటిద్దామని భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకుడు డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి మంగళవారం ఖమ్మం జిల్లా ప్రజలకు ఓ సందేశంలో తిరంగా ర్యాలీల పట్ల తన స్పందనను తెలిపారు. ఖమ్మంలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో కొన్ని చిన్నపాటి సంఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో వాటిని పెద్దదిగా చూస్తూ రాజకీయాం చేయటం బాధాకరమని ఆయన విమర్శించారు.

ఇలాంటి కార్యక్రమాలలో కొన్ని సంఘటనలు సహజం అని, వాటిని బాధ్యతగా పరిశీలించాలని, తప్పులను సరిదిద్దుకోవాలని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా శాంతికి మార్గదర్శకంగా నిలవాలి అని తెలిపారు.

గుండెపోటుతో మహిళ మృతి



లక్ష్మి మృతదేహం

కల్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): కల్లూరు వైపు నంచి ఆర్టీసీ బస్సులో మంగళవారం ప్రయాణిస్తున్న ఓ మహిళకు గుండెపోటు రాగా ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందింది. సత్తుపల్లి టూ ఖమ్మం వెళుతున్న ఆర్టీసీ బస్సులో సత్తుపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన బి.లక్ష్మి(70) కుటుంబ సభ్యులతో కలిసి ఖమ్మానికి వైద్య చికిత్స నిమిత్తం వెళుతోంది. మార్గమధ్యంలో తల్లాడ బస్టాండుకు చేరుకోగానే లక్ష్మికి గుండెపోటు రాగా వెంటనే 108 వాహనంలో కల్లూరులోని ఏరియా ఆసుపత్రికి తీసుకోవచ్చారు. ఆస్పత్రిలో వైద్యం అందిస్తుండగా పరిస్థితి విషమించి లక్ష్మి మృతి చెందింది. ఈ సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కల్లూరు ఏరియా ఆస్పత్రికి వచ్చి లక్ష్మి మృతదేహన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

వైద్య ఉద్యోగికి ఏడాది జైలుశిక్ష

భద్రాచలం, మే 20 (ఆంధ్రజ్యోతి): మహిళపై దురుసుగా ప్రవర్తించిన కేసులో ముద్దాయికి ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.500 జరిమాన విధిస్తూ భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయాధికారి శివనాయక్ తీర్పు వెల్లడించారు. భద్రాచలంలోని ఏరియా వైద్యశాలలో పని చేస్తున్న ఎంఎన్‌వో గుర్రం లాల్‌ఖాన్ చికిత్సకు వచ్చిన మహిళతో అవమానకర రీతిలో ప్రవర్తించాడని భద్రాచలం ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ రామకృష్ణ ఫిర్యాదు చేశారు. దీంతో 2022, ఏప్రిల్ 27న కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరచగా వాదోపవాదనలు ముగియగా మంగళవారం తీర్పు వెల్లడించారు.

108 వాహనంలో ప్రసవం

బూర్గంపాడు, మే 20(ఆంధ్రజ్యోతి): పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మగశిశువుకు జన్మనిచ్చింది. ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ములకలపల్లి మండలం పాత గుండాలపాడు గ్రామానికి చెందిన నాగమణి పురిటినొప్పులతో బాధపడుతుండటంతో 108 వాహనంలో బూర్గంపాడులోని సీహెచ్‌సీకి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో పురిటినొప్పులు అధికమై మగశిశువుకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉండడంతో వారిని బూర్గంపాడు ఆస్పత్రికి తరలించారు. 108 వాహనంలో ప్రసవం చేసి తల్లీబిడ్డను కాపాడిన 108సిబ్బంది మంగ, సాయికుమార్‌ను మహిళ కుటుంబసభ్యులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

అన్నపురెడ్డిపల్లి, మే 20: (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రగుంట గ్రామంలో మంగళవారం జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొన్న ఘటనలో మహ్మద్ మౌలానా(70) అనే వృద్ధుడు మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. చంద్రుగొండకు చెందిన మౌలానా కొంతకాలంగా ఎర్రగుంటలో నివాసం ఉంటున్నాడు. మౌలానా ద్విచక్ర వాహనంపై మసీదుకు వెళ్తుండగా సత్తుపల్లి నుంచి బొగ్గులోడుతో వస్తున్న టిప్పర్ మౌలానా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది ఈ ప్రమాదంలో మౌలానా శరీరం ఛిద్రమైంది. దీనిపై ఆగ్రహించిన మౌలానా కుటుంబ సభ్యులు, గ్రామస్థులు రోడ్డుపై నిరసనకు దిగారు. మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నిరసన చేస్తున్న వారిని శాంతిపజేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం కొరకు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బొగ్గు టిప్పర్ల అడ్డగింత

చంద్రుగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంటలో బొగ్గుటిప్పర్ ఢీకున్న ఘటనలో చంద్రుగొండకు చెందిన మౌలానా మృతి చెందగా తమకు న్యాయం చేయాలని మృతుడు కుటుంబ సభ్యులు చంద్రుగొండ వాసులతో కలిసి చంద్రుగొండ ప్రధాన సెంటర్‌లో బొగ్గుటిప్పర్లను నిలిపివేసి రాస్తారోకోకు చేపట్టారు. దాంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. స్థానిక ఎస్ఐ శివరామకృష్ణ సిబ్బదితో వచ్చి ఇరువర్గాలు చర్చలతో సమస్య పరిష్కరించుకోవాలని కోరారు. దాంతో ఆందోళన విరమించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

▸▸ యువకుడికి గాయాలు

జూలూరుపాడు, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వినోబానగర్ గ్రామ సమీపంలో మంగళవారం ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ధారావత్ ప్రవీణ్ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై ఖమ్మం నుంచి పాల్వంచ వస్తున్నాడు. ఈ క్రమంలో జూలూరుపాడు నుంచి ఏన్కూర్ వైపు వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. వాహనాలు రెండు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో కొంతమేర ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు. ట్రాఫిక్‌ను మళ్లించారు. రెండు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సింగరేణి సంస్థపై యువ అధికారులు అవగాహన పెంచుకోవాలి

▸▸ సింగరేణి ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం

రుద్రంపూర్, (సింగరేణి) మే 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ అభివృద్ధి, నూతన ప్రాజెక్టుల ఏర్పాటు భవిష్యత్ ప్రణాళికలపై యువ అధికారులు అవగాహణ పెంచుకోవాలని సింగరేణి ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం అన్నారు. బొగ్గు ఉత్పత్తి, నూతన ప్రాజెక్టు ఏర్పాటుపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి వ్యాప్తంగా పని చేస్తున్న మేనేజర్లు, డిప్యూటీ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మూడు సంవత్సరాల్లో సింగరేణిలో అనుభవజ్ఞులైన అధికారులంత పదవీ విరమణ చేయనున్నారని, సింగరేణి భవిష్యత్ అంతా యువ అధికారులపైనే ఆధారపడి ఉందన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి, వ్యాపార విస్తరణ, నూతన ప్రాజెక్టుల ఏర్పాటు, సంస్థ ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్ ప్రణాళికలు తదితర అంశాలపై అధికారులు అవగాహనతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎల్‌వి. సూర్యనారాయణ, కే. వెంకటేశ్వర్లు, జీఎంలు మనోహర్, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, ఈడీ సుభాని, మార్కెటింగ్ జీఎం రాజశేఖర్, అన్నిఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.



నిరుపేదలకు సరుకుల పంపిణీ



తిరుమలాయపాలెం, మే20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరేణిలో చెగువేర భూపతి ఫౌండేషన్ ద్వారా 11మంది నిరుపేద కుటుంబాలకు మంగళవారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఎస్ఐ కూసుపుడి జగదీష్ ఎంపీడీవో సిలార్‌సాహెబ్ వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ చంద్రశేఖర్, గంటా బీమయ్య, మాచర్ల కొండలరావు, మాజీసర్పంచ్ గంటా నిర్మల పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంరూరల్, మే20(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలకు మంత్రి పొంగులేటి శ్రీనివా‌స్‌రెడ్డి రూ.10వేల అందజేస్తామని ఇటీవల ప్రకటించారు. ఈనేపథ్యంలో ఖమ్మం రూరల్ మండలంలో మంగళవారం ఈ కార్యక్రమాన్నిమద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథబాబు, కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. మండలంలోని వెంకటగిరి, గుదిమళ్ల, గుర్రాలపాడు, తెల్దారుపల్లి, తల్లంపాడు, కామంచికల్, తదితర గ్రామాల్లో 26బాధిత కుటుంబాలకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి జగదీష్, మద్ది మల్లారెడ్డి, మద్ది వీరారెడ్డి, అంబటి సుబ్బారావు, వెంకటరెడ్డి, బోడా వెంకన్న, మొక్క శేఖర్ గౌడ్, పంతులునాయక్,వెంకటనారాయణ, నాగండ్ల శ్రీనివాస్,రాంమూర్తి పాల్గొన్నారు.

స్వచ్ఛంద పారిశుధ్యం

- మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో కేఎంసీ ముందుకు
- వర్షాకాలానికి ముందే డ్రెయినేజీల శుభ్రంపై స్పెషల్ డ్రైవ్

ఖమ్మంసంక్షేమవిభాగం, మే20(ఆంధ్రజ్యోతి): నగరం పరిశుభ్రంగా ఉండేందుకు ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని మేయర్ పునుకొల్లు నీరజ పిలుపునిచ్చారు. మంగళవారం కేఎంసీ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన మెప్మా అధికారులతో మేయర్ సమావేశం నిర్వహించారు. ప్రణాళిక ప్రకారం ఖమ్మం నగరంలో పారిశుధ్య కార్యక్రమాలు డివిజన్లు వారీగా చేపట్టామన్నారు. వర్షాకాలంలో వరదల ముంపు తొలగాలంటే ఇప్పటి నుంచి ప్రధాన డ్రెయినేజీల నుంచి అంతర్గత రహదారుల వరకు ప్లాస్టిక్, పూడిక, ఇతర వ్యర్థాలను పూర్తిగా తొలగించాలన్నారు. అయితే వంద రోజులు పారిశుధ్య కార్యక్రమంలో బాగంగా కేఎంసీ పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యచరణ చేశామన్నారు. ప్రజల్లో పారిశుధ్యంపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మెప్మా పరిధిలోని మహిళా



స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. ప్రతీరోజు ఐదు డివిజన్లలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఆడివిజన్లలో జవాన్లు, మెప్మా ఆర్పీలు, స్వంద సంస్థలు ఇంటింటి పారిశుధ్య అవగాహన, డ్రెయినేజీల పరిశీలన కార్యక్రమాలు చేస్తామన్నారు..మరో రెండురోజుల్లో స్వచ్ఛంద పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రకటిస్తామన్నారు. డీఎంసీ సావల సుజాత, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి పాల్గొన్నారు.

నేటినుంచి మొక్కల కోసం మహిళలు

- నగరంలో నాలుగు ప్రాంతాల్లో 7,500 మొక్కలు నాటేందుకు లక్ష్యం
- రెండేళ్ల పాటు నిర్వహణ మహిళా సంఘాలకే..

ఖమ్మంసంక్షేమ విభాగం, మే 20 (ఆంధ్రజ్యోతి):వనమహోత్సవంలో భాగంగా ఖమ్మం నగరంలో 'మొక్కల కోసం మహిళలు' ప్రత్యేక కార్యక్రమానికి మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ప్రత్యేక కార్యచరణ చేశారు. మొక్కల నాటేందుకు ఏర్పాట్లు నుంచి రెండేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. ఖమ్మం నగరంలోని డంపింగ్‌యార్డులో రెండు ప్రాంతాలు, ఖానాపురం ట్యాంకు బండ్, మరియు కేఎంసీ సమీపంలోని ఫ్రీడమ్ పార్కులోని ఖాళీ స్థలాలను టౌన్ లెవల్ ఫెడరేషన్ అధికారులు పరిశీలించారు. డంపింగ్‌యార్డులోని రెండు వెర్వేరు ప్రాంతాల్లో 6వేల మొక్కలను నాటాలని సిద్ధం చేశారు. సిరివెన్నెల, భవాని ఎస్‌హెచ్‌జీ సంఘాలు, ఖానాపురం ట్యాంకు బండ్‌పై రిషిత ఎస్‌హెచ్‌జీ ఆధ్వర్యంలో వెయ్యి మొక్కలు, ఫ్రీడమ్ పార్కులో శ్రీరామ ఎస్‌హెచ్‌జీ నిర్వాహణలో 500మొక్కలను నాటేం



డంపింగ్‌యార్డులో మొక్కల నాటే స్థలం

దుకు కార్యాచరణ చేశారు. బుధవారం ఆయా ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలకు అధికారులు అవగాహన సమావేశాలు నిర్వహించనున్నారు. మేరకు మొక్కలు నాటే ప్రాంతాలను సదను చేశారు. జూన్ 5లోపుగా గుర్తించిన నాల్గు ప్రాంతాల్లో మొక్కల కార్యచరణ పూర్తి చేసి వన మహోత్సవం సందర్భంగా మొక్కలను నాటనున్నారు. రెండేళ్ల పాటు మొక్కల నిర్వాహణను మహిళా సంఘాలు చేపటనున్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: డీఈవో



నేలకొండపల్లి, మే20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి సామినేని సత్యనారాయణ కోరారు. మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులకు ఐదురోజులపాటు జరగనున్న శిక్షణ కార్యక్రమాన్ని నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి బాలిన చలపతిరావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా విద్యాధికారి సామినేని సత్యనారాయణ మాట్లాడుతూ శిక్షణలో బోధనకు సంబంధించిన అనేక విషయాలపై శిక్షణ ఇప్పించబడుతుందన్నారు. శిక్షణలో నేర్చుకున్నదాన్ని ఉపాధ్యాయులు తమ బోధనలోఉపయోగించుకోవాలని, తద్వారా విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందించాలని కోరారు.

కేఎంసీకి సిఫారసుల తలనొప్పి

అధికారంలోకి వచ్చిన తొలి నాలుగేళ్లు అభివృద్ధి, సంక్షేమ పథకాలు కావాలని పోటా పోటీగా పనిచేసిన కార్పొరేటర్లు.. ఇప్పుడు తుది ఏడాదిలో మాత్రం తమ అనుచరగణాన్ని ఖమ్మం నగర పాలక సంస్థలో ఉద్యోగులుగా నియామకం చేసేందుకు తీవ్రఒత్తిడి చేస్తున్నారు. కొంతమంది నాయకులు ఏకంగా మంత్రులు, కలెక్టర్ పేర్లు చెప్పి మరీ సిఫారసు చేస్తున్నారు. కనీస విద్యార్హత, ఉద్యోగ ప్రమాణాలు లేని వారికి ఉద్యోగాలు పెట్టిస్తున్నారు. ఇది కేఎంసీ పరిపాలనకు తలనొప్పిగా మారింది...

- కలెక్టర్, మంత్రుల పేరు చెప్పి ఉద్యోగం ఇవ్వాలని వత్తిడి
- పోటా పోటీగా కార్పొరేటర్ల సిఫారసులు
- అక్రమ ఉద్యోగ నియామకాలతో కేఎంసీకి అప్రతిష్ట



ఖమ్మంసంక్షేమవిభాగం,మే20(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లలో ఖమ్మం నగరపాలక సంస్థలో కార్పొరేటర్లు సిఫారసుతో 30మందికిపైగా ఉద్యోగాల్లో చేరారు. ఫాగింగ్, జవాన్లు నుంచి డంపింగ్‌యార్డు, డీఆర్ఎఫ్ బృందాలు, కంప్యూటర్ ఆపరేటర్లు వరకు ఉద్యోగాలు చేస్తున్నారు.గతంలో పనిచేసిన మేయర్లు సైతం ప్రవేట్ వ్యక్తులను డ్రైవర్లుగా పెట్టుకొని వారు పదవీ కాలం వెళ్లే లోపుగా వారిని కేఎంసీలో ఉద్యోగంలో పెట్టారు. తర్వాత వారికి ఆఫీస్ అటెండర్లుగా ప్రమోషన్‌లు కల్పించారు. ట్యాంకర్ డ్రైవర్లుగా అవుట్ సోర్సింగ్ నియామకాలు చేశారు. అక్రమంగా ప్రమోషన్లు కల్పించారు. కొంతమంది జవాన్లుగా నాయకులుగా చలామని అవుతున్నారు. కనీస విద్యాభ్యాసం లేని వారు కూడా జవాన్లుగా ఉద్యోగుల పొందారు. ఏదైనా కారణంతో వేతనాలు నిలుపుదల చేస్తే ఏకంగా మేయర్ వద్దకు వెళ్లి పంచాయతీ పెడ్తున్నారు. గ్రూప్ 4లో ఉద్యోగాలు పొందిన వార్డు ఆఫీసర్లను బెదిరిస్తున్నారు. కేఎంసీ పరిపాలనకే తల నొప్పిగా మారారు. పదేళ్లలో జరిగిన అక్రమ నియామకాలపై ఇప్పటికి విజిలెన్స్ విచారణ కొంత మంది అధికారులు ఎదుర్కొంటున్నారు.

తుది ఏడాది అదే తీరు

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యోగాలు పెట్టించిన కార్పొరేటర్లు కాంగ్రెస్ ప్రభుత్వంలోను తమ అనుచరులను ఉద్యోగాలు పెట్టించేందుకు తరుచూ ఖమ్మం నగర పాలక సంస్థకు వస్తున్నారు. కేఎంసీ అధికారుల వద్దకు వెళ్లి మంత్రులు సిఫారసు చేశారని, గత ఎన్నికల్లో గెలుపుకోసం పనిచేశారని తప్పకుండా ఉద్యోగాలు ఇవ్వాలని అధికారులపై వత్తిడి పెంచుతున్నారు. ఇటీవల కాలంలో కేఎంసీలోని నిర్వాహణ ఉద్యోగులకు వేతనాలు పెంచటంతో అక్కడ ఉద్యోగాలు పెట్టించేందుకు ముగ్గురు కార్పొరేటర్లు నిత్యం వారి మనుషులను పెట్టించేందుకు తిరుగుతున్నారు. ఏకంగా కలెక్టర్ సిపారసులు ఉన్నాయని దరఖాస్తుదారులతో కేఎంసీ ఉన్నతాధికారులను వాదించే స్థాయికి వెళ్లారు. ఇలా డీఆర్ఎఫ్ బృందాల నుంచి పారిశుధ్య కార్మికులు, పారిశుధ్య డ్రైవర్లు, కేఎంసీ స్వీపింగ్ ఉద్యోగాలు, పార్కుల ఉద్యోగాలు నియామకాలు చేయిస్తున్నారు.

కనీస ప్రమాణాలు లేకుండానే..

డీఆర్ఎఫ్ నుంచి పారిశుధ్య విభాగం వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలంటే హైదరాబాద్, వరంగల్ మున్సిపాలిటీలు బహిరంగ ప్రకటనలు జారీ చేసి ఉద్యోగ నియామకాలు చేస్తారు. డీఆర్ఎఫ్‌లో ఉద్యోగం రావాలంటే పోలీసు ఉద్యోగ నియామక పరీక్షల్లో కనీస అర్హత పొందిన వారిని మాత్రమే దరఖాస్తులు చేసేందుకు అనుమతిస్తారు. విద్యార్హత, అనుభవం, శారీరక ప్రమాణాలు, ఆరోగ్య ప్రమాణాలు లెక్కిస్తారు. కానీ కేఎంసీలో మాత్రం మెప్మా పరిధిలోని టౌన్ లెవల్ ఫెడరేషన్‌ను అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా కార్పొరేటర్లు సిపారసులు చేస్తూ ఉద్యోగాలు పెట్టిస్తున్నారు. ఇలా ఉద్యోగాలు పొందిన వారు ఆయా కార్పొరేటర్లుకు కేఎంసీ నుంచి శాశ్వత కాలం ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. కార్యాలయంలోని ప్రతి విషయాన్ని లీకులు ఇస్తున్నారు. ఉద్యోగాలు పెట్టించిన కార్పొరేటర్లుకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను వివరణ కొరగా విచారణ చేస్తామన్నారు.

హెచ్ఐవీ నియంత్రణకు కృషి చేయాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, మే20(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ,ఎయిడ్స్‌వ్యాధి నియంత్రణకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ, తీసుకోవలసిన చర్యలపై ఆయన వైద్యాధికారులతో సమీక్షించారు. జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు ఎంతమంది సిబ్బంది ఉన్నారు, ఎన్ని స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయి, ఎయిడ్స్ నియంత్రణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణపై వాటి పనితీరు వివరాలను పర్యవేక్షించేందుకు వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ నెలా ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించాలని,హెచ్ఐవీ వ్యాధి విస్తరణ తగ్గాలంటే తప్పనిసరిగా ముందస్తు చర్యలు చేపట్టాలని, నిరోధ్ ప్యాకెట్లు అందించడంతో పాటు వాటి వినియోగంపై కూడా అవగాహన కల్పించాలన్నారు. హైరిస్క్ ఉన్నవర్గాల్లో పెళ్లికి



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ముందు తప్పనిసరిగా పరీక్షలు చేసుకునేలా చూడాలన్నారు. తల్లికి ఎయిడ్స్ వ్యాధి ఉన్నట్లు ముందుగానే తెలిస్తే బిడ్డకు వ్యాపించకుండా నిరోధించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ప్రదర్శించేలా చిన్నచిన్న వీడియోలు, ఫోన్‌మేసేజ్ తయారు చేయాలన్నారు. ఈసమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి.కళావతి బాయి, అడిషనల్ డీఎంహెచ్‌వో. పి.వెంకట రమణ, ఏఆర్టీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ పి. మోహన్‌రావు, డేటా మేనేజర్ పి.శ్రీకాంత్, ఏపీపీఏ, సీఎస్సీసీ ఎల్‌హెచ్‌లు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

ఏకగ్రీవం దిశగా గ్రానైట్ టైల్స్ యజమానుల సంఘం ఎన్నికలు

ఖమ్మంఖానాపురంహవేలి, మే20(ఆంధ్రజ్యోతి): ది ఖమ్మం గ్రానైట్ ఫ్యాక్టరీ టైల్స్ యజమానుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం దిశగా సాగుతోంది. 2025-27 సంవత్సరానికి సంబంధించిన ఎన్నికలు ఈనెల ఈనెల 28న జరగనున్నాయి. ఈ మేరకు ఈనెల 16న ఎన్నికల అధికారి బుగ్గవీటి. శ్రీధర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మంగళవారం జరిగిన నామినేషన్ల ప్రక్రియలో నామినేషన్ పత్రాలు దాఖలు చేయటానికి సమయం ఆఖరు నిమిషం వరకు కేవలం ఒక్కోపదవికి ఒక్క నామినేషనే దఖాలు కావటంతో ఎన్నిక ఏకగ్రీవం కానున్నదని తెలుస్తుంది.నామినేషన్ల స్వీకరణ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల అధికారి కార్యాలయంలో స్వీకరించారు. ఈ నెల 21న నామినేషన్ల పరిశీలన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు, 23న నామినేషన్ల ఉపసంహరణ మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎన్నికల అధికారి కార్యాలయం స్నేహిత గ్రానైట్స్ ఐడీఏలో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

దాఖలైన నామినేషన్లు ఇలా

అధ్యక్షు పదవికి తెడ్డు.రమేష్, ఉపాధ్యక్షుడు1 పదవికి బోయిడి. వెంకటరమణ, ఉపాధ్యక్షుడు 2కి బోరం. నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శికి మోతుకూరి. రామభద్రయ్య, సంయుక్త కార్యదర్శి 1కి పోలూరి. కృష్ణ, సంయుక్త కార్యదర్శి 2కి చాగంటి. సందీప్, కోశాధికారిగా చాగంటి. శ్రీకాంత్, ఈసీమెంబర్‌గా వీరెల్లి. సీతారామయ్యలు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. మొత్తం 8నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు.

పంటల మార్పిడిపై దృష్టి సారించాలి

ఖమ్మంరూరల్, మే20(ఆంధ్రజ్యోతి): రైతులు పంట మార్పిడిపై దృష్టి సారించాలని రూరల్ ఏఓ ఉమానగేష్ సూచించారు. మండల పరిధిలోని పోన్నేకల్లు రైతు వేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వానకాలం పంటలు-సూచనలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులు విత్తనాలను అధీకృత విత్తనాల షాప్‌ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. బిల్లులను పంట కాలం భద్రపరుచుకోవాలన్నారు. రాత్రి వేళల్లో అనుమానాస్పద విక్రయాలు గ్రామాలలో చేపట్టిన, గుడ్డ సంచులలో పత్తి విత్తనాలు అమ్మిన సమీప



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో

వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

డీలర్ల సమావేశంలో ఏడీఏ సరిత

తిరుమలాయపాలెం, మే20(ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు అంటగడితే చర్యలు తీసుకుంటామని ఏడీఏ సరిత హెచ్చరించారు. మంగళవారం తిరుమలాయపాలెం రైతువేదికలో మండలంలోని విత్తన డీలర్లుతో సమావేశం నిర్వహించారు. విత్తన డీలర్లు తప్పనిసరిగా ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు విత్తనాలు అమ్మినపుడు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని వాటి మీద రైతులు, డీర్లు సంతకం పెట్టాలన్నారు. ఓఫారంలేని విత్తనాలు అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. డీలర్లు నేమ్ బోర్డు, స్టాక్‌బోర్డు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. పత్తివిత్తనాలు అమ్మినప్పుడు రైతుల వివరాలు రిజిస్టర్‌లో నమోదుచేయాలన్నారు. నకిలీవిత్తనాలు అమ్మితే పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నారెడ్డి సీతారాంరెడ్డి, ఏఈవోలు బాలకృష్ణ, మౌనిక, ఆసియా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ ఎదుట మహిళల ఆందోళన

ముదిగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): ముదిగొండలోని స్త్రీశక్తి కార్యాలయం ఎదుట డ్వాక్రా మహిళలు మంగళవారం ఆందోళన చేశారు. కమలాపురం గ్రామంలో ఓ వీవో అధ్యక్షురాలి ఎంపికలో సీసీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని డ్వాక్రా మహిళలు ఆరోపించారు. ప్రస్తుతం కొనసాగుతున్న వీవో అధ్యక్షురాలిని తొలగించి కొత్తవారిని ఎన్నుకోవాలని డ్వాక్రా మహిళలు డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఏపీఎం కల్పన మాట్లాడుతూ.. సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో డ్వాక్రా మహిళలు ఆందోళన విరమించారు. అనంతరం ఏపీఎం కల్పనకు వినతిపత్రం అందజేశారు. మహిళలు చేపట్టిన ఆందోళనకు పలు రాజకీయ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

రోగుల పట్ల సేవాభావం ఉండాలి

- జిల్లా వైద్యాధికారి కళావతి బాయి
- పాలియేటివ్ కేర్ సెంటర్ సందర్శన

ఖమ్మంకలెక్టరేట్, మే20(ఆంధ్రజ్యోతి): పాలియేటివ్ కేర్‌లో ఉన్న రోగుల పట్ల సేవాభావం ఉండాలని వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.కళావతిబాయి అన్నారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో వయో వృద్ధులకేర్ సెంటర్ (పాలియేటివ్‌కేర్ సెంటర్), క్యాన్సర్ బాధిత మహిళ పేషంట్ల వార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులను పరామర్శించి వారికి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి పేషంట్లు ఇంటి దగ్గర ఉండడం వల్ల రోగులతో పాటు కుటుంబం సభ్యులకు కూడా మానసికంగా చాలా ఒత్తిడి ఉంటుంది అని, ప్రభుత్వం ప్రత్యేకంగా చివరి అవసాన దశలో వున్న పేషంట్ల కోసం పాలియేటివ్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్ హాజరు పట్టిక, ఇన్ పేషంట్ల రిజిస్టర్, అందిస్తున్న సేవల వివరాలు, రోగుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి సమీక్షించారు.



రికార్డులు పరిశీలిస్తున్న కళావతిబాయి

అనంతరం ప్రధాన ఆసుపత్రిలో తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్‌ను పరిశీలించారు.

సంపదను సంపన్న వర్గాలకు పంచుతున్న మోదీ



మాట్లాడుతున్న గోవిందరావు

- అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల మానవహారం, ర్యాలీ

ఖమ్మంసంక్షేమవిభాగం,మే20(ఆంధ్రజ్యోతి): దేశసంపదను సంపన్న వర్గాలకు ప్రత్యేకించి పెట్టుబడిదారులకు ప్రధాని మోదీ దోచిపెడుతున్నారని బీజేపీయేతరరైతు,కార్మిక సంఘాలు నేతలు ఆరోపించారు. మంగళవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఖమ్మంలో ర్యాలీ నిర్వహించారు. జెడ్పీసెంటర్‌లో మానవహారం చేపట్టారు. 5శాతం కలిగిన పెట్టుబడి వర్గాల్లో 70 శాతం దేశసంపద చేరిందని ఆరోపించారు. కార్మికుల హక్కుల స్థానంలో కార్మిక కోడ్‌లను అమలులోకి తీసుకొచ్చి కార్మికుల హక్కుల్ని కాలరాసిందన్నారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. నాయకులు ఎస్ నరేశ్ నాయుడు, తుమ్మా విష్ణువర్దన్, జీ రామయ్య, కొండపర్తి గోవిందరావు, కొత్తా సీతారాములు, నున్నా నాగేశ్వరరావు, మలీదు నాగేశ్వరరావు, పాషా, మందుల రాజేంద్రప్రసాద్, పాల్వంచ కృష్ణ, భద్రం, శింగు నర్సింహారావు పాల్గొన్నారు.

భూ సేకరణపై గ్రామ సభలు

కల్లూరు, మే20 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని బత్తుపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో మగళవారం సీతారామ ప్రాజెక్టు పరిధిలో అనుసంధానంగా తలపెట్టిన డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణపై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు కెనాల్ ఇంజనీరింగ్ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో చంద్రుగొండ మండలం ఎర్రగుంట నుంచి సీతారామ ప్రాజెక్టు ద్వారా కల్లూరు ప్రాంతానికి సాగునీరు అందించేలా డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణం జరగనున్నదని ఆయన తెలిపారు. ఈ కెనాల్ నుంచి 24 కిమి వరకు పొడవున లక్ష్మీపురం వరకు పొడవున డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణం పనులు చేపట్టనున్నారని చెప్పారు. ప్రభుత్వ పరంగా మార్కెట్ ధరకు రెండున్నర రెట్లు ప్యాకేజిగా రైతులకు పరిహారం అందంచటం



గ్రామసభలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జరుగుతుందన్నారు. దీని పరిధిలో కెనాల్ నిర్మాణానికి భూసేకరణపై రైతులకు అవగాహన కల్పించేలా ఈ గ్రామ సభలు మండలంలోని బత్తుపల్లి, లక్ష్మీపురంలో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహిసిల్దార్ సాంబశివుడు, ఆర్ఐలు, రైతులు పాల్గొన్నారు.

తరగతిగదిలో బోధనకు విద్యార్థే కేంద్ర బిందువు

ఖమ్మంఖానాపురంహవేలి,మే20 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో బోధనకు విద్యార్థే కేంద్రబిందువుఅని, దానిని ప్రామాణికంగా తీసుకొని బోధన జరగాలని కామేపల్లి మండల విద్యాశాఖ అధికారి జి. వెంకట్ అన్నారు. మంగళవారం నగరంలోని ఎన్ఎస్‌ఎ కెనాల్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎఫ్ఎస్ఎల్ ద్వారా వృత్తి పరమైన,బోధనాపరమైన నైపుణ్యాల పెంపుకు, వందశాతం విద్యార్థుల నమోదు కోసం శిక్షణను ప్రారంభించారు. శిక్షణకు సంబంధించిన పలు అంశాలను ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షౌకత్ అలీ, కేశవరావు, రవికుమార్, మాధవరావు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

తిరుమలాయపాలెం, మే20(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్లేడు గ్రామానికి చెందిన మిషన్‌భగీరథ కార్మికుడు కూరపాటి వెంకటరత్నం విద్యుత్‌షాక్‌తో కాళ్లు కోల్పోయాడు.అతడి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడుభూక్యాసురేష్25కేజీల బియ్యం, రూ.2వేలు అందించారు.ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ భూక్యా వీరన్న,యలమంద, నరసయ్య, నవీన్, వెంకటేష్ పాల్గొన్నారు.

చెరువులను ట్యాంక్‌బండ్‌లుగా అభివృద్ధి

మధిరటౌన్,మే20(ఆంధ్రజ్యోతి): మధిర నియోజక వర్గంలో ఆరుచెరువులను ట్యాంక్‌బండ్‌లుగా అభివృద్ధి చేస్తున్నారు. దీని కోసం రూ.30.60 కోట్లను విడుదల చేశారు. చింతకాని మండల కేంద్రం లోని చింతకాని చెరువుకు రూ.7.90కోట్లు, మధిర మండలంలోని మాటూరు చెరువుకు రూ.90లక్షలు, బయ్యారంచెరువుకు రూ.2.90 కోట్లు, బోనకల్ మండలం లోని కలకోట చెరువుకు రూ.7.05 కోట్లు, ముదిగొండ మండలంలోని ముత్తారం చెరువుకు రూ.8.95 కోట్లు, చిరుమర్రి చెరువుకు రూ.2.90 కోట్లు విడుదల చేశారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

ఎర్రుపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు నాణ్యమైన విత్తనాల్లో జాగ్రత్త వహించాలని నకిలీ విత్తనాలు అమ్మినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో బి.సాయిశివ మంగళవారం ఒక ప్రకటలనో తెలిపారు. వర్షాకాలం వస్తుండడంతో రైతుల అవగాహన లేమితో నకిలీ విత్తనాలు కొనవద్దని, ముఖ్యంగా బీటీ 3 పత్తివిత్తనాలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాలు ఎవరైనా అమ్మాలని చూస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కొనుగోలు సమయంలో రశీదు తీసుకోవాలన్నారు. అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చారించారు.

డిప్యూటీ సీఎం భట్టి చిత్రపటానికి క్షీరాభిషేకం



భట్టి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, గ్రామస్థులు

ముదిగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం వనంవారి క్రిష్టాపురంలో మంగళవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చిత్రపటానికి రైతులు, గ్రామస్థులు క్షీరాభిషేకం చేశారు. వనంవారిక్రిష్టాపురం, ముత్తారం నుంచి సువర్ణాపురం వరకు డిప్యూటీ సీఎం రూ.4కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు పనులు జరుగుతుండటంతో హర్షం వ్యక్తంచేస్తూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. దశాబ్ధాల కాలంగా ఎదురుచూసిన రోడ్డు నిర్మాణ కల నెరవేరిందని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

తలసేమియా పిల్లల కోసం రక్తదానం



రక్తదానం చేస్తున్న పల్లిపాడువాసులు రణధీర్‌చౌదరి, భానుప్రకాశ్‌చౌదరి

కొణిజర్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం ఖమ్మంలోని విజయశ్రీ బ్లడ్‌బ్యాంక్‌లో తలసీమియా పిల్లల అవసరార్థం మండలంలోని పల్లిపాడు గ్రామానికి చెందిన తాటిపల్లి రణధీర్‌చౌదరి, ముక్కా భానుప్రకాశ్‌చౌదరి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. రక్తదానం చేసిన వారిని డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, ఫ్రెండ్స్‌యూత్ అధ్యక్షుడు తాటిపల్లి సుధీర్ అభినందించారు. కూరపాటి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ తలసీమియా పిల్లలకు ప్రతి 15రోజులకు ఒకసారి బ్లడ్ అవసరం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు.

ఐకేపీ ఎదుట మహిళల ఆందోళన



ఏపీఎం కల్పనకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

ముదిగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): ముదిగొండలోని స్త్రీశక్తి కార్యాలయం ఎదుట డ్వాక్రా మహిళలు మంగళవారం ఆందోళన చేశారు. కమలాపురం గ్రామంలో ఓ వీవో అధ్యక్షురాలి ఎంపికలో సీసీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని డ్వాక్రా మహిళలు ఆరోపించారు. ప్రస్తుతం కొనసాగుతున్న వీవో అధ్యక్షురాలిని తొలగించి కొత్తవారిని ఎన్నుకోవాలని డ్వాక్రా మహిళలు డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఏపీఎం కల్పన మాట్లాడుతూ.. సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో డ్వాక్రా మహిళలు ఆందోళన విరమించారు. అనంతరం ఏపీఎం కల్పనకు వినతిపత్రం అందజేశారు.

రేషన్ దుకాణాల్లో అధికారుల తనిఖీ

కల్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం సివిల్ సప్లై అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి రేషన్ షాపులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రేషన్ షాపుల్లో సన్న బియ్యం, దొడ్డు బియ్యం నిల్వల పూర్తి వివరాలను, రికార్డులను తనిఖీలు చేశారు. ఇలా మండలంలోని కల్లూరు, చెన్నూరు, ముచ్చవరం, పేరువంచ, చిన్నకోరుకొండి, మర్లపాడు, తాళ్లూరు, వెంకటాపురం, బత్తుపల్లి గ్రామాల్లో రేషన్ షాపుల్లో నిల్వల రికార్డులను తనిఖీలు చేసి తదుపరి సమాచారాన్ని జిల్లా అధికారులకు అందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు సత్యనారాయణ, నాగలక్ష్మి, వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణపై గ్రామ సభలు



గ్రామసభలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కల్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బత్తుపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో మగళవారం సీతారామ ప్రాజెక్టు పరిధిలో అనుసంధానంగా తలపెట్టిన డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణపై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు కెనాల్ ఇంజనీరింగ్ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. త్వరలో చంద్రుగొండ మండలం ఎర్రగుంట నుంచి సీతారామ ప్రాజెక్టు ద్వారా కల్లూరు ప్రాంతానికి సాగునీరు అందించేలా డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణం జరగనున్నదని ఆయన తెలిపారు. ఈ కెనాల్ నుంచి 24 కిమి పొడవున లక్ష్మీపురం వరకు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరంగా మార్కెట్ ధరకు రెండున్నర రెట్లు ప్యాకేజిగా రైతులకు పరిహారం అందంచటం జరుగుతుందన్నారు. తహిసీల్దార్ సాంబశివుడు, ఆర్ఐలు, రైతులు పాల్గొన్నారు.

పిడుగుపాటు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

కారేపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాజుమల్లాయిగూడెంలో పిడుగుపడి 17 గొర్రెలు మృతిచెందడంతోపాటు, వాటి యాజమాని మద్దెల లక్ష్మయ్య, అతని బార్య లక్ష్మీలు తీవ్రంగాయపడి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నరు. వారిని ప్రభుత్వం అదుకోవాలని మండల సీపీఐ నాయకుడు ఉంగరాల సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ నిరుపేద కుటుంబ సభ్యులైనా లక్ష్మయ్య దంపతులు గొర్రెలపైనే ఆదారపడి జీవిస్తున్నట్లు తెలిపారు. చనిపోయిన గొర్రెలకు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించాలన్నారు. సీఎం సహాయనిధి నుంచి ఆర్ధికసహాయం చేయాలని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను సుధాకర్ కోరారు. ప్రకృతి ప్రమాదాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని సుధాకర్ అన్నారు.

కార్మిక చట్టాలపై వెల్లువెత్తిన నిరసనలు

» నల్లబ్యాడ్జీలతో నిరసనలు

» మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు



కల్లూరులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన

సత్తుపల్లి/మధిరటౌన్/ఏన్కూరు/తల్లాడ/కల్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి, కార్మిక చట్టాలను అమలు చేయాలని సత్తుపల్లిలో మంగళవారం కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక జేఏసీ నాయకులు అమర్లపూడి శరత్, నిమ్మటూరు రామకృష్ణ, కొలిగిపోగు సర్వేశ్వరరావులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక కోడ్స్‌ను అమలు చేస్తూ శ్రామిక ప్రజలపై బానిసత్వపు పరిస్థితులను పెంపొందించేలా ప్రయత్నిస్తుందని విమర్శించారు. కార్మికుల సామాజిక భద్రతను హరించి వేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో కార్మికుల హక్కులకు సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికృష్ణ, వెంకటేష్, బాజీ, యోబు, శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర చర్యలు

కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన కార్మిక చట్టాలను వెనక్కి తీసుకోవాలని కోరుతూ మంగళవారం మధిర బస్‌డిపో ముందు ఆర్టీసీ కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ.. అనేక ఏళ్లగా కార్మిక హక్కుల కోసం ఉన్న చట్టాలను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం నూతనంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు రానుందని వీటిని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతు కార్మిక సంఘాలు నేడు పోరాటదినంగా పాటిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్, ఎస్‌డబ్ల్యాయు నాయకులు సుందర్‌రావు, బండి శ్రీను, నాగేశ్వరరావు, కోరంపల్లి అంకమరావు తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి..

కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తూ కార్మికుల పొట్ట కొడుతున్న మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బానోతు బాలాజీ, గొర్రెల, మేకల సంఘం జిల్లానాయకులు దొంతబోయిన నాగేశ్వరరావు, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బానోత్ అమల, ఇనపనూరి అనురాధ, రజిత, సుజాత, విజయ, వ్యవసాయకార్మికసంఘం మండల కార్యదర్శి ఇటికాల లెనిన్, నండూరి శ్రీనివాసరావు, తమ్మినేని జయరాజు, కేవీపీఎస్ జిల్లానాయకులు సుంకర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌ను ప్రోత్సహిస్తోన్న కేంద్రం..

కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ తల్లాడలో టీయూసీఐ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధంచేశారు. పటాన్‌నాగులు మీరా అధ్యక్షతన జరిగినసభలో టీయూసీఐ జిల్లా నాయకుడు షేక్ లాల్‌మియా మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలుచేస్తోందని విమర్శించారు. టీయూసీఐ ఏరియా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, శ్రీను, రమేష్, కిషోర్, దేవదానం, సురేష్, నరసింహారావు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులకు నిర్బంధం

కల్లూరులో మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పలు సంఘాల నుంచి కార్మికులు నల్లబ్యాడ్జీలతో పలు ప్రభుత్వ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, ఐకేపీ, ఎంపీడీఓ, ఏంఈఓ, కార్యాలయాల వద్ద మధ్యాహ్న బోజన, స్వీపర్లు, పంచాయితీకార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడుతూ.. కనీస వేతన చట్టం ప్రకారం రూ, 26 వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ మండల నాయకులుదయాకర్, గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజశేఖర్, మల్లేష్, ఆసుపత్రి కార్మికులు కృష్ణ, నాగమణి, సరోజని, గ్రామదీపికల సంఘం జిల్లా కన్వీనర్ నాగమణి పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

పెనుబల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను టీడీపీ, ఆయన అభిమానుల ఆధ్వర్యంలో మంగళవారం వీఎంబంజర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుబల్లి మసీదు సెంటర్ నుంచి రింగ్‌సెంటర్ వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించి రింగ్‌సెంటర్లో కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా పులిహోర, స్వీట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం బాణా సంచా కాల్చి శుభాకాంక్షలు తెలిపారు.

సెల్‌ఫోన్‌ను అప్పగించిన ఆర్టీసీ సిబ్బంది



ఫోన్‌ను బాధితునికి అందిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

వైరా, మే 20 (ఆంధ్రజ్యోతి): వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ ప్రయాణీకుడు మరిచిపోయిన సెల్‌ఫోన్‌ను ఆర్టీసీ సిబ్బంది నిజాయితీతో అప్పగించిన ఉదంతమిది. మంగళవారం కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామానికి చెందిన మాలోతు నర్సింహా ఖమ్మం వెళ్లేందుకు వైరా బస్టాండ్‌కు వచ్చాడు. బస్సు రాగానే బెంచీపై సెల్‌ఫోన్ మర్చిపోయి బస్సు ఎక్కి వెళ్లిపోయాడు. సెల్‌ఫోన్‌ను గమనించిన కంట్రోల్ వెంకన్న, ప్యాసింజర్ గైడ్ కె.నాగేశ్వరరావు ఆ ఫోన్‌ను భద్రపరిచి నర్సింహాకు అప్పగించారు.

రైతు డిజిటల్ కార్డ్ నమోదు ప్రక్రియ వేగవంతం

కల్లూరు/కారేపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు విశిష్ట గుర్తింపు కార్డ్ నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ కార్యక్రమాలు వర్తించేలా రైతు విశిష్ట గుర్తింపు కార్డ్ ప్రక్రియ వ్యవసాయశాఖ తరుపున చేపట్టారు. ఇప్పటికే మండలంలో 42 వేల ఎకరాలకు గానూ 21, 546 మంది రైతుల నమోదు ప్రక్రియలో ఏఈఓలు నిమగ్నమయ్యరు. మండల వ్యవసాయ అధికారిణీ ఎ.రూప పర్యవేక్షణలో రైతు విశిష్ట గుర్తింపు కార్డ్ కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. రైతుల ఆధార్ కార్డ్‌కు ఫోన్ లింక్ ద్వారా ఐడి నెంబరు ఇస్తున్నట్లు ఏఓ రూప తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలైన పీఎం కిసాన్, పికేఈఐ నిధులు రైతుల ఖాతాలలో జమ కావాలంటే రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు బీమా, రైతు భరోసాకు ఈ నమోదు అవసరం లేదని అధికారులు అంటున్నారు. రైతు పొలం ఆధార్ కార్డ్‌కు లింక్‌తో క్లిక్ చేయడంతో పూర్తి సమాచారం వస్తుంది. ఈ ప్రక్రియ ఈనెలఖారు నాటికి పూర్తి చేయాలన్నారు. మండలంలోని లింగాల గ్రామంలో మంగళవారం రైతు విశిష్ట గుర్తింపు కార్డు ప్రక్రియను సత్తుపల్లి వ్యవయసాయ శాఖ ఏడి శ్రీనివాసరెడ్డి ఏఓ రూపతో కలిసి పరిశీలించారు.

కొనసాగుతోన్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ

మండలంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం ముమ్మరంగ కొనసాగుతుంది. అర్హులైన రైతులు తమ పట్టాదారుపాసు పుస్తకం, ఆధార్ కార్డ్ జిరాక్స్‌లతో వచ్చి సంబంధిత వ్యవసాయశాఖ కార్యలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఎవో బట్టు అశోక్‌కుమార్ మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతు ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, లేకుంటే కేంద్రప్రభుత్వం ద్వారా రైతులకు అందే రాయితీలు వర్తించవన్నారు.

జాబ్‌మేళాలో ఉద్యోగులందరూ భాగస్వాములవ్వాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా/ఏన్కూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): వైరా ప్రభుత్వ హైస్కూల్లో ఈనెల 24న నిర్వహించే మెగా జాబ్‌మేళను విజయవంతం చేసేందుకు అన్నిస్థాయిల్లోని అధికారులు, ఉద్యోగులు భాగస్వాములు కావాలని స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పిలుపునిచ్చారు. వైరాలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మండలస్థాయి అధికారులు, మున్సిపల్, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ గ్రామదీపికలు, పోలీస్ ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడారు. 24న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ మెగా జాబ్‌మేళాను ప్రారంభిస్తారని తెలిపారు. ప్రతి అధికారి భాగస్వాములై తమ బాధ్యతగా భావించి గ్రామాల్లోని నిరుద్యోగులను ఈ జాబ్‌మేళాకు వచ్చేలా చూడాలని సూచించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్, సీఐ ఎన్.సాగర్, ఎంపీడీవో సరస్వతీ, మున్సిపల్ కమిషనర్ చింతా వేణు, వైరా, కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి, జూలూరుపాడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, స్వర్ణ నరేంద్ర, తలారి చంద్రప్రకాష్, మంగీలాల్, పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు పాల్గొన్నారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

మెగాజాబ్‌మేళాను నిరుద్యోగ వయుత సద్వినియోగించుకోవాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కోరాఉ. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాబ్‌మేళాపై విలేకరుల సమావేశం నిర్వహించారు. సింగరేణి సంస్థ సహకారంతో 80 కంపెనీలలో 5వేల ఉద్యోగాలు కలిపించడం జరుగుతుందన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ , పీజీ నిరుద్యోగ యువత అధికసంఖ్యలో పాల్గొని ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినచ 16 నెలల కాలంలోనే 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు కలిపించడం జరిగిందన్నారు. నిరుద్యోగుల తమ పేర్లను ముందుగా నమోదుచేసుకోవాలన్నారు. వైరా నియోజకవర్గలో పెద్దఎత్తున జాబ్‌మేళా నిర్వహించడం ఇదే తొలిసారి అన్నారు.

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి



నియామక పత్రాలను అందజేస్తున్న నాయకులు

చింతకాని, మే 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తెలుగు దేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ రాష్ట్ర నాయకులు డా. వాసిరెడ్డి రామనాథం కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికలలో పార్టీ క్రియాశీలక పాత్ర పోషించనుందన్నారు. నాయకులు పార్టీను బలోపేతం దిశగా కష్టపడి పనిచేయాలన్నారు. అనంతరం పార్టీ నూతన మండల కమిటీ ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా తేలుకుంట్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా నన్నక రామారావు, ప్రధాన కార్యదర్శిగా దారగాని రామారావును ఎన్నికయ్యారు. సందర్భంగా నూతన మండల కమిటీకు నియామక పత్రాన్ని రామనాథం అందజేశారు. మధిర, బోనకల్ మండల నాయకులు సీతయ్య, సత్యనారాయణ, గోపాలరావు, నున్నా తాజుద్దీన్,రామారావు, మల్లెల సత్యనారాయణ, సత్యనారాయణ, సుధాకర్, లగడపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి

» డీఈవో సత్యనారాయణ

ముదిగొండ/ఎర్రుపాలెం/సత్తుపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలని డీఈవో ఉపాధ్యాయులకు సూచించారు. ముదిగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వృత్యంతర శిక్షణ శిబిరాన్ని మంగళవారం సందర్శించి పరిశీలించారు. రాబోయే విద్యాసంవత్సరంలో ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా పనిచేయాలన్నారు. పాఠశాలల ప్రారంభం రోజున పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేయాలన్నారు. ఎంఈవో రమణయ్య, ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్‌లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

విద్యాబోధన సరళంగ ఉండాలి

మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణను ఎంఈవో మురళీమోహన్‌రావు మంగళవారం ప్రారంభించారు. ఐదురోజులపాటు జరిగే ఈ క్రార్యక్రమంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. పాఠశాలల్లోవిద్యాబోధన సరళంగా ఉండాలన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు శిక్షణను తరగతి గదికి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఉపాధ్యాయులంతా తరగతి గదికి నిత్య నూతనంగా వెళ్లాలని తెలిపారు. ఈ విద్యాసంవత్సరం బోధన, బోధనేతర అంశాల్లో మార్పులు కలిపించాలనిసూచించారు. ఈశిబిరంలో 77మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధనకే శిక్షణ


సత్తుపల్లి మండలాన్ని విద్యా వ్యవస్థలో అగ్రగామిగా ఉన్నదని మండల విద్యాశాఖ అధికారి నక్కా రాజేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల స్థాయిలో పని చేస్తున్న ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలకు విద్యా శాఖ తరుపున ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరంలో మరింత ఉన్నతంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ మధుసుధనాచారి, చెన్నకేశవరెడ్డి, రవీందర్‌రెడ్డి, బాలాజీ, శ్రీనివాసరెడ్డి, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణ షురూ

» రూ.30.60 కోట్లు విడుదల

మధిరటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గంలో ఆరు చెరువులను ట్యాంక్‌బండ్‌లుగా అభివృద్ధి చేసేందుకు 30.60 కోట్ల రూపాయలు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. చింతకాని మండల కేంద్రంలోని చింతకాని చెరువుకు 7.90కోట్లు, మధిర మండలంలోని మాటూరు చెరువుకు 90 లక్షలు, బయ్యారం చెరువుకు 2.90 కోట్లు, బోనకల్ మండలంలోని కలకోట చెరువుకు 7.05 కోట్లు, ముదిగొండ మండలంలోని ముత్తారం చెరువుకు 8.95 కోట్లు, చిరుమర్రి చెరువుకు 2.90 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది.


ప్లాస్టిక్ కవర్లు అమ్మితే కేసులు



ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

మధిరటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లు అమ్మితే కేసులు నమోదు చేయడం జరుగుతుందని మధిర మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్ తెలిపారు. మంగళవారం మధిర పరిధిలోని పలు దుఖాణాలపై దాడులు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు, ప్లాస్టిక్ కవర్లను అమ్మినా, వినియోగించిన కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మిడిల్ పోల్స్ పనుల్లో జాప్యం



కిందకు వేలాడుతున్న తీగలను కర్రతో పైకి లేపి ఉంచిన దృశ్యం

బోనకల్, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో మిడిల్ పోల్స్ పనుల్లో జాప్యం జరుగుతుండటంతో ప్రజలకు ప్రమాదాల భయం వెంటాడుతోంది. మండలంలోని చిరునోముల గ్రామ చెరువు సమీపంలో విద్యుత్ తీగలు బాగ వదులై కిందకు వేలాడుతున్నాయి. పొలాల్లో చేతికందే ఎత్తులో ఉండడంతోపాటు తీగలు ఒకదానికొకటి రాపిడికి గురై మంటలు వస్తున్నాయి. కరివేద పిచ్చయ్యకు చెందిన పామాయిల్ పొలంలో వైర్ల రాపిడికి విద్యుధాఘాతంతో చెట్లకు మంటలు అలుముకున్నాయి. చెట్ల ఆకులు కాలిపోయాయి. గతంలో విద్యుత్ స్తంభాలను దాదాపు 70 మీటర్ల వ్యవధిలో వేశారు. కాల క్రమేణా పెరిగిన ఉష్ణోగ్రతల వల్ల తీగలు వ్యాకోచించి వదులయ్యాయి. విద్యుత్ స్తంభాల నడుమ దూరం తగ్గించి మిడిల్ పోల్స్ వేస్తే సమస్య పరిష్కారం అవుతుంది. ఇందుకు సంబంధించి మండలానికి మిడిల్ పోల్స్ కూడా వచ్చాయి. కాని పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పోల్స్ వేసే పనులు చేసేందుకు జాప్యం చేస్తుండటంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎంత చెబుతున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపనలు వినిపిస్తున్నాయి. చిరునోముల రెవెన్యూ పరిధిలో విద్యుత్ తీగలు బాగా కిందకు ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించిప్రమాదం ఉన్నచోట మిడిల్ పోల్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



రైతు, కరివేద పిచ్చయ్య, చిరునోముల

విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండటంతో వాటిని పైకి ఉంచేందుకు కర్రను ఉంచాము. వదులైన తీగల రాపిడికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి పామాయిల్ మొక్కలకు మంటలు అంటుకున్నాయి.పొలం పనులకు వెళ్తున్న తమకు కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగల వల్ల భయంవేస్తోంది. అధికారులు స్పందించి మిడిల్ పోల్స్ వెంటనే వేయించాలి.